నేడు నల్లజర్లకు సీఎం చంద్రబాబు


ముస్తాబైన సీఎం సభావేదిక

వెయ్యి మంది రైతులతో ముఖాముఖి

రాజమహేంద్రవరం/సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాకకు నల్లజర్ల ముస్తాబైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం 10.30గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలి కాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11.10 గంటలకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి 11.30గంటలకు నల్లజర్లలో వ్యవసాయ భూమి పరిశీలనకు వెళ్తారు. 11.30 నుంచి 11.50 వరకూ స్టాల్స్‌ను సందర్శిస్తారు. కలెక్టర్ స్వాగత ప్రసంగం చేస్తారు. 12.15 నుంచి 12.20 వరకూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రసంగిస్తారు. సీఎం చంద్రబాబు 12.55 గంటల వరకూ 1000 మంది రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. వేదికపై ఏర్పాటు చేసిన మంచంపై కూర్చుని రైతులు, వారి కుటుంబాలతో కూడా మాట్లాడతారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. తర్వాత మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు. 1.45 నుంచి 3.15 గంటల వరకూ గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 3.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 3.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళ్తారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పెద్దసంఖ్యలో రైతులు పాల్గొంటున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజావేదిక వద్ద ఐదు స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సభలో రైతులు, వ్యవసాయం, హార్టీకల్చర్, మత్స్య శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీకే అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. 1200మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. పర్యటన సజావుగా సాగేలా సభావేదిక, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు, భద్రత చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జేసీ వై.మేఘ స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు.


నల్లజర్లలో సీఎం పాల్గొననున్న రైతన్న - మీకోసం సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ మేఘ స్వరూప్ తదితరులు


కాకినాడ పెద్దాసుపత్రిలో జ్వరపీడితులు

అమలాపురం మండలం బండారులంకలో ఫీవర్ సర్వే

ఆసుపత్రులక్యూ!

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న జ్వరపీడితులు

ఫీవర్స్.. వైరల్!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జ్వర పీడితులు పెరుగుతున్నారు. చిన్న,పెద్ద, తేడా లేకుండా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. గత వారం రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో భారీగా కేసులు నమోదవుతున్నాయి. సాధారణంగా కాకినాడ జీజీహెచ్‌కు ప్రతి రోజూ 2 వేలకు పైగా ఓపీ ఉంటుంది.వీరిలో జ్వర పీడితులే అధికంగా ఉంటున్నారు. రాజ మహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతిరోజూ సుమారు వెయ్యి నుంచి 1200 వరకూ ఓపీ ఉంటే వీరిలో ఎక్కువ మంది సీజనల్ వ్యాధులతోనే ఆసుపత్రికి వస్తున్నట్లు జనరల్ మెడిసిన్ వైద్యులు చెబుతున్నారు. కోనసీమలోనూ ఇదే పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి లక్షణాలతో ఆసుపత్రులకు వస్తున్నారు. ఇంట్లో ఒకరి తర్వాత ఒకరు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి పోతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రం తగ్గడం లేదని మళ్లీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.అసలే జ్వరంతో రోగులు బాధపడుతుంటే రకరకాల టెస్టులతో ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు మరింత నీరసించేలా చేస్తున్నారు.రక్త, బీపీ, షుగర్ టెస్టులతో పిండేస్తున్నారు. పలువురు ఆసుపత్రులకు వెళ్లేందుకే భయపడుతున్నారు.

సీజన్ మారింది. చలిగాలుల తాకిడి అధికమైంది. తుఫాన్ ప్రభావంతో ఒక వైపు వానలు కురుస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు అధికంగా జ్వరాల బారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గాలిలో వైరస్ కారణంగా చికెన్ ఫాక్స్, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, కీళ్ల నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో క్యూ కడుతున్నారు. కొన్ని నెలలుగా డెంగీ, మలేరియా కేసులు నమోదవుతుండగా స్క్రబ్ టైఫస్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.

- కాకినాడ/ అమలాపురం/రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి)

కాకినాడలో స్క్రబ్ టైఫస్..

ఈ ఏడాది జనవరి నుంచి పరిశీలిస్తే కాకినాడలో ఐదు వేల మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 200కిపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. నాలుగు నెలలుగా కేసులు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు కలవరపెడుతున్నాయి. నల్లి లాంటి ఓ కీటకం కుట్టడం ద్వారా కుట్టినచోట దద్దుర్లు, నల్లటి మచ్చలు ఏర్పడడం, జ్వరం, వాంతులు, తల, ఒంటి నొప్పులు, పొడి దగ్గు లక్షణాలతో ఆస్పత్రికి వచ్చేవారు అధికమయ్యారు. లాలాజలంతో ఈ ఇన్ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి సోకుతున్నట్టు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు. కాకినాడ జిల్లాలోనే అత్యధికంగా 1452 మందికి పరీక్షలు చేయగా 148 కేసులు నమోదయ్యాయి. కాకినాడ, అర్బన్, గ్రామీణ ప్రాంతాలతో పాటు సామర్లకోట, పెద్దాపురం తుని, ప్రత్తిపాడు ప్రాంతాల నుంచి ఎక్కువ కేసులు వచ్చాయి. మిగతా మండలాల్లోను ఈ వ్యాధి బాధితులు ఉన్నారు. గత నెల నవంబర్‌లో 251 మందిని పరీక్షించగా 47మంది ఈ వ్యాధికి గురయ్యారు.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- వైరల్, డెంగీ జ్వరాలతో ఇక్కట్లు
- కాకినాడలో స్క్రబ్ టైఫస్ కేసులు
- తూర్పు, కోనసీమల్లో డెంగీ

స్క్రబ్ టైఫస్ సోకితే ఐదు రోజులు వైద్యం

స్క్రబ్ టైఫస్ సోకడానికి పరిసరాల అపరిశుభ్రతే కారణం. ఇంటి పరిసరాలు, పనిచేసే ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి. తుప్పల వద్ద జాగ్రత్తగా ఉండాలి. వ్యాధి సోకితే నివారణకు ఐదు రోజుల పాటు వైద్యం తీసుకోవాలి.

- డాక్టర్ ప్రభాకర్, కాకినాడ మలేరియా అధికారి

కోనసీమలో డెంగీ

కోనసీమ జిల్లాలోనూ జ్వరపీడితులు ఉన్నారు. గతేడాది జిల్లాలో 292 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 34 కేసులు నమోదయ్యాయి. వైరల్ జ్వరాల బారిన పడినవారు గతంలో రోజువారీ నివేదికల్లో 250 మంది ఉండేవారు. ప్రస్తుతం రోజుకు 170 నుంచి 180 మంది ఉంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు వెల్లడించారు. నవంబరులో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ విభాగంలో 61మందిని జ్వర పీడితులుగా గుర్తించారు. మరో 15 మంది ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకున్నారు. ప్రస్తుతం రోజుకు ఇద్దరు, ముగ్గురు మాత్రమే వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఒక డెంగీ కేసుకు ఆస్పత్రిలో వైద్యం చేయగా ఇద్దరు ఓపీ విభాగంలో డెంగీ పాజిటివ్‌గా గుర్తించామని అమలాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు వెల్లడించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులేమీ నమోదుకాలేదని డీఎంహెచ్‌వో దుర్గారావురావు వెల్లడించారు.

'తూర్పు'న ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలో మలేరియా, న్యుమోనియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఇన్‌పేషెంట్ కేసులు తక్కువగానే ఉన్నా అవుట్‌పేషెంట్లు ఎక్కువ మంది ఉంటున్నారు. పిడియాట్రిక్ విభాగంలో శ్వాసకోశ సంబంధిత సమస్యలతో చిన్నారులు వైద్యానికి వస్తున్నారు. జ్వరకేసులు నమోదవుతున్నాయి. పక్కనున్న ఏఎస్ఆర్ జిల్లా నుంచి మలేరియా కేసులు వస్తున్నాయని.. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం జీరో అని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో గోకవరం, నామవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జ్వరపీడితుల్లో కొందరికి ఇక్కడి వైద్యులు ప్రాథమికంగా మలేరియాగా నిర్ధారించినట్టు తెలిసింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో డెంగీ కేసులు మాత్రం 32 నమోదైనట్టు లెక్కలు చెబుతున్నారు.

ప్రత్యేక వైద్యం అందిస్తున్నాం

స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. గ్రామాల్లో అవగాహన కల్పి స్తున్నాం. జిల్లాలో జ్వర బాధితులకు ప్రత్యేక వైద్యం అందిస్తు న్నాం. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో నిత్యం వైద్యపరీక్షలు జరుగుతున్నాయి. అజిత్రోమైసిన్, డాక్సిసైక్లిన్ మందులను అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా జ్వరపీడితులు పెరిగితే సమాచారం ఇవ్వాలి.

- నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా


గోదావరిలో బోట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు, అధికారులు

పర్యాటకంగా గోదావరి తీరం అభివృద్ధి

అధికారులతో కలిసి గోదావరిలో బోట్‌లో పర్యటించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు కొవ్వూరును టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గోదావరి నదిలో కొవ్వూరు గోష్పాదక్షేత్రం నుంచి కుమారదేవం వరకు పర్యాటక, రెవెన్యూ, ఏజీఆర్‌బీ శాఖల అధికారులతో కలిసి మంగళవారం బోట్‌లో పర్యటించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస చేసేందుకు కాటేజ్‌లు, పార్క్‌లు, రూమ్‌లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయడానికి గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. కొవ్వూరు పట్టణ ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన స్థలం ఉందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు, పర్యాటకులు గోదావరి అందాలను తిలకించేందుకు తీర ప్రాంతాన్ని పర్యాటకంగా సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. పుష్కరాలకు గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కొవ్వూరు పట్టణ, మండలంలోని సుమారు 38 స్నానఘట్టాలు సిద్ధం చేస్తున్నామన్నారు. దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని,టూరిజం జిల్లా అధికారి పి.వెంకటాచలం,ఇన్‌చార్జి డీవీఎం పవన్‌కుమార్, ఈఈ విజయభాస్కర్, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు,బోటింగ్ మేనేజర్ ఆర్.గంగబాబు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ టెన్త్ స్టడీ మెటీరియల్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ రాష్ట్ర సంఘం నిష్ణాతులతో తయారు చేయించి ముద్రించిన టెన్త్ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని డీఈవో కె.వాసుదేవరావు, ఏడీ వెంకట్రాజు ఆవిష్కరించారు.రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ నేతృత్వంలో ఈ పుస్తకాలను విడుదల చేశారు. జిల్లా కోశాధికారి ప్రసాద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచి కోటసత్తెమ్మ తిరునాళ్లు

నిడదవోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తిరునాళ్లు 4వ తేదీ గురువారం నుంచి 8వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహిస్తామని ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. గురువారం ఉదయం దేవులపల్లి రవిశంకర్ దంపతులచే వైదిక స్మార్త ఆగమ ఆచారం ప్రకారం కలశ స్థాపనతో తిరునాళ్లు ప్రారంభమవుతాయి. 5వ తేదీ శుక్రవారం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, మాంగల్యదేవి అమ్మవారి దేవస్థానం వారిచే కోటసత్తెమకు చీర, సారె సమర్పణ, 6వ తేదీ నిడదవోలు ఆర్య వైశ్య సంఘంచే చీర సారె సమర్పణ, 7వ తేదీ ఆదివారం అఖిలభారత తెలుగు సేవా ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షురాలు అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వ ర్యంలో రాజమండ్రి నుంచి 101 మంది మహిళలచే చీర, సారె, కలశాలతో బోనం సమర్పణ, 8వ తేదీ సోమవారం వివిధ మేళాలతో గరగ ఉత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారి తిరునాళ్లు ఐదు రోజులు ఉదయం చండీపారాయణం, సాయంత్రం చండీ హోమం, అమ్మవారికి విశేష పూజలు చేస్తారు.



ఇళ్లివ్వండి బాబు!

టిడ్కో ఇళ్లకు పేదల ఎదురుచూపులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టిడ్కో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు..గత పదేళ్లగా పేదింట కల గంటూనే ఉన్నారు. అయినా నేటికీ కల తీర లేదు..ఇల్లు రాలేదు.గత టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను నిర్మించినా.. వైసీపీ నిర్లక్ష్యం కారణంగా పేదలకు ఇళ్లు అందలేదు. పేదల కనీస అవసరమైన ఇంటి కలను నెరవేర్చడానికి 2014లో అధికా రంలోకి వచ్చిన టీడీపీ పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను నిర్మించిన సంగతి తెలిసిందే.2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రజల గూడుకు చీడ పట్టింది. ఈనాటికి లబ్ధిదారులకు దక్కకుండా వృథాగా పడి ఉన్నాయి.మొదట్లో టీడీపీ ఎంపిక చేసిన లబ్ధి దారుల్లో కొంత మందిని వైసీపీ మార్చేసిం ది.రుణాలు సరిగ్గా ఇప్పించలేదు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికా రంలో ఉండడం తో ఇటీవల కదలిక వచ్చింది. టిడ్కో ఇళ్లను డిసెంబర్ చివరికి లబ్ధిదారులకు అప్పగిం చేలా ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది.అయితే ఈ సారైనా ఇస్తారా లేదా అనే మీమాంసలో లబ్ధిదారులు ఉన్నారు. సీఎం చంద్రబాబు తమ గోడు విని గూడు కల్పిం చాలని డిమాండ్ చేస్తున్నారు. నేడు సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టిడ్కో గృహాలుఎప్పుడిచ్చేది లేల్చాలని కోరుతున్నారు.

- నేటికి అందని వేలాది ఇళ్లు
- గత వైసీపీ నిర్లక్ష్యం.. నిలిచిన టిడ్కో
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- సొంతింటి కోసం తీవ్ర ప్రయత్నాలు
- సీఎం గారు ఇవ్వాలని డిమాండ్

డిసెంబరుకు టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

బొమ్మూరులో పెండింగ్ పనులు జరుగుతున్నాయి. తొర్రేడులో డ్రెయిన్ నిర్మిస్తు న్నాం. ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే పనులు వేగవంతం అయ్యాయి. నామవరంలో జంగిల్ క్లియరెన్స్ తీసుకున్నాం. చెట్లు కొట్టిన వెంటనే డ్రైన్, రోడ్ల నిర్మాణం, ఇతర పనులు పూర్తి చేస్తాం. నామవరం, బొమ్మూరు ఫేజ్-2 ఇళ్లను డిసెంబర్ చివరికి లబ్ధిదారులకు అప్పగిస్తాం. కొవ్వూరు, నిడద వోలు టిడ్కో ఇళ్ల విషయంలో కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్‌తో ఒప్పందమైన తర్వాతే పనులు ఆరంభిస్తాం.

- పి.గంగరాజు, టిడ్కో ఈఈ

సా..గుతున్న పనులు..

రాజమహేంద్రవరంలో ఏడు ప్రాజెక్టుల కింద 6304 టిడ్కో ఇళ్లు నిర్మించారు. అందులో 5,574 మందికి రిజి స్ట్రేషన్లు పూర్తయ్యాయి.ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి.కానీ మౌలిక సదుపాయాల్లేకపోవడంతో ఇళ్లలో ఉన్నది మాత్రం చాలా తక్కువ మంది. చాలా ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. బొమ్మూరులో మొదటి దశలో 2528 ఇళ్లు నిర్మించారు. తొర్రేడులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవళే శ్వరంలోని వడ్డెర కాలనీలో 256 నిర్మించారు.బొమ్మూరు నిర్మించిన ఇళ్లలో 2528 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా 1977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు.బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు. అక్కడ ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాల్సి ఉంది. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చారు. ధవళేశ్వరం(వడ్డెర కాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్పగిం చారు. మోరంపూడి డి.బ్లాక్‌లో 224 ఇళ్లు అప్పగించినా కనీస సౌకర్యాలు లేక కేవలం 15 మంది మాత్రమే ఉం టున్నారు. రెండో దశలో నామవరంలో 1104 ఇళ్లు, సిం హాచలనగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1100 నిర్మించారు.ఇవి ఇంకా పూర్తి కాలేదు. మౌలిక సదు పా యాలు కల్పించలేదు. బొమ్మూరు ఫేజ్-2, నామవరం టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు.బొమ్మూరులో ఇళ్లను డిసెంబర్ చివరినాటికి లబ్ధిదా రులకు అప్పగిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు.నామవరంలో చెట్లు తొలగించిన తర్వాత పనులు ఆరంభమ వుతాయి.డిసెంబర్ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేస్తామని అధికారులు చెబుతున్నారు.

నిడదవోలు, కొవ్వూరులో ఇలా..

నిడదవోలులో 1755 మంజూరు కాగా 1248 ఎంపిక చేసి 1152 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లబ్ధిదా రుల ఎంపిక కూడా పూర్తిగా జరగలేదు.ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. కొవ్వూరు పరిధిలో పేదలకు 480 ఇళ్లు మంజూరు కాగా 480 మొదలు పెట్టారు. ఇళ్ల నిర్మాణం జరిగినా మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో మొత్తం పెండింగ్‌లో పడింది. ఇక్కడ పనులు ఆపేసిన కాంట్రాక్టరును రద్దు చేసి కొత్త కాంట్రాక్టరు పనులు అప్పగించాలనే ఆలోచనతో ఉన్నారు. కొవ్వూరు, నిడదవోలు టిడ్కో ఇళ్ల 2026లోనే ఇవి లబ్ధిదారులకు అందే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఏపీజీఈఏ జిల్లా ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనివార్య కారణాల వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా ఉపాధ్యక్ష పదవికి, సంఘం సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు పి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. గత కొన్నేళ్లగా అసోసియేషన్లలో అధిష్ఠానం, సభ్యుల కోరిక మేరకు కొనసాగడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు ఆయా సంఘాల అధ్యక్షులకు వాట్సాప్ ద్వారా రాజీనామా లేఖలను పంపించడం జరిగిందని రవికుమార్ పేర్కొన్నారు.


విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్న దృశ్యం

వారంతా దివ్యాంగులు. విభిన్న ప్రతిభావంతులు, బుద్ధి మాంద్యం, వికలత్వం కలవారు. కుటుంబీకుల సహకారం లేనిదే కాలకృత్యాలు తీర్చుకోలేరు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది ఉమా మనో వికాస కేంద్రం. ఇది ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గత 37 ఏళ్లుగా వేలాది మందికి సేవలందిస్తోంది. ఈ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి దివ్యాంగుల సాధికారితే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...



దివ్యాంగుల మనో నేత్రం


చిన్నారుల ఆట, పాట

ఉమా వికాస కేంద్రం

- దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆసరా
- 1988లో కాకినాడలో ప్రస్థానం
- 37 ఏళ్లుగా విశేష సేవలు
- రెండు సార్లు రాష్ట్రపతి, ఆరుసార్లు జాతీయ పురస్కారాలు

(సర్పవరం జంక్షన్ (కాకినాడ)-ఆంధ్రజ్యోతి)

దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, సాంఘిక సాధికారిత, పునరావాసం కల్పించేందుకు 1988లో కాకినాడలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ (ఉమా మనో వికాస కేంద్రం)ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి స్థాపించారు. తొలుత బుద్ధి మాంద్యత గల 9 మంది పిల్లలతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు వేలాది మంది విద్యార్థులకు ఆరోగ్యం, ప్రత్యేక విద్య, సమీకృత, వృత్తి విద్యనందిస్తోంది. సాంస్కృతిక, సాంఘికపరమైన శిక్షణ ఇస్తూ జీవనోపాధికి అవకాశాలు కల్పిస్తోంది. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలతో పాటు యానాంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలకు గుర్తింపుగా ఎస్‌పి రెడ్డి రెండు సార్లు రాష్ట్రపతి నుంచి ఉత్తమ అవార్డులు, ఆరు సార్లు జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు.

ప్రత్యేక స్కూల్, ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్స్

బుద్ధి మాంద్యత విద్యార్థులకు ప్రత్యేక విద్యతో పాటు ఆరేళ్లలోపు చిన్నారులకు, అభి వృద్ధి దశల్లో ఆలస్యమైన సుమారు 2,600 మం దికి ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అంది స్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రత్యేక స్కూల్లో ప్రత్యేక విద్యనందిస్తున్నారు. యానాంలో ప్రత్యేక స్కూల్, ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సర్వీసెస్ సేవలు అందిస్తున్నారు. 2009 నుంచి తాళ్లరేవులో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ధీరుబాయి అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్, పునరావాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ ఆర్థిక సహకారంతో బధిర అంధత్వం, విశిష్ట వైకల్యం గల 420 మంది పిల్లలు, వ్యక్తులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సంస్థాగత, గృహ ఆధారిత, సమాజ ఆధారిత పునరావాసం కల్పించారు.

సమాజ ఆధార పునరావాస కార్యక్రమం (సీబీఆర్): దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పునరావాసం కల్పించే ఉద్దేశ్యంతో 1994లో ఈ కార్యక్రమాన్ని రంపచోడవరం మండలంలో ప్రారంభించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు ఇప్పటివరకు సుమారు 25వేల మందికి పైగా ఆరోగ్యం, విద్య, జీవనోపాధి ద్వారా లబ్ధి పొందారు.

ప్రత్యేక విద్య కళాశాల

దివ్యాంగుల్లో మానవ వనరుల అభివృద్ధి కోసం రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (మెంటల్ రిటార్డేషన్, వినికిడి సమస్య) కోర్సులను 2021 నుంచి అక్నూ యూనివర్సిటీ అనుబంధ సంస్థగా ప్రత్యేక విద్యా కళాశాల నిర్వహిస్తున్నారు.


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి జాతీయ పురస్కారం అందుకుంటున్న ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి

జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డీడీఆర్‌సీ)

2011లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలో డీడీఆర్‌సీ ఏర్పాటుచేసి సేవలు అందిస్తున్నారు వికలత్వంపై అవగాహన సదస్సులు, చట్టాలు, సంక్షేమ పథకాలు, కృత్రిమ పరికరాల అంచనా, పంపిణీ చేస్తున్నారు. నవజాత శిశువుల్లో వినికిడి సమస్యను గుర్తించేందుకు కాకినాడ జీజీహెచ్‌లో ప్రతి గురువారం అత్యాధునిక ఏవోఈ, బెరా యంత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించి పునరావాసం కల్పిస్తున్నారు.


కృత్రిమ కాలు తయారు చేస్తున్న దృశ్యం

కృత్రిమ అవయవాల తయారీ మొబైల్ వర్క్‌షాపు

కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌ని 1997లో ప్రారంభించారు. ట్రై సైకిల్స్, శ్రవణ యంత్రాలు, కృత్రిమ కాళ్లు వంటి సహాయ పరికరాలను ఏటా 700 నుంచి 900 వరకు పంపిణీ చేస్తున్నారు. 2015లో మొబైల్ వర్క్‌షాపుని రిలయన్స్ ఇండస్ట్రీస్ సహకారంతో వాకలపూడిలో ఏర్పాటుచేశారు. ఈ మొబైల్ యూనిట్ ప్రతి మండల కేంద్రానికీ వెళ్లి దివ్యాంగుల కృత్రిమ పరికరాలను రిపేర్ చేయడం, కొత్త వాటికి కొలతలు తీసుకోవడం చేస్తోంది.

నన్నయకు ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు


నన్నయ వర్సిటీకి లభించిన ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు చూపుతున్న వీసీ ప్రసన్నశ్రీ

- త్వరలో ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ : వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధి, ఉన్నత విద్యలో శ్రేష్ఠతను, నాణ్యతను అందించడానికి కృషిచేస్తూ తగిన వనరులను అందిస్తున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐదు ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. త్వరలో ఫైవ్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ దక్కుతుందని చెప్పారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం ఐఎస్‌వో ఎగ్జిట్ సమావేశాన్ని ఐ.క్యూ ఏసీ డైరెక్టర్ వి.పెర్సిస్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి ఆలపాటి శివయ్య ఈ ఐదు సర్టిఫికెట్లను వీసీకి అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఐఎస్‌వో 50001:2018 అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ నిర్వహణ వ్యవస్థను అమలు చేసిన కారణంగా ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్, ఐఎస్‌వో 14001:2015 అవసరాలకు అనుగుణంగా పర్యావరణ నిర్వహణ వ్యవస్థను అమలు చేసిన కారణంగా ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్, ఐఎస్‌వో 9001:20 15 చక్కని విద్య సేవలందిస్తున్నందుకు జెండర్ సెన్సిటైజేషన్ ఆడిట్ సర్టిఫికేషన్, అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ సర్టిఫికేషన్స్ లభించడం అభినందనీయమన్నారు. ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టమ్ సర్టిఫికేషన్ పర్యావరణ ప్రభావాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి, వారి పర్యావరణ పనితీరు మెరుగుపరచడానికి సంస్థలకు సహాయ పడుతుందన్నారు. జెండర్ సెన్సిటైజేషన్ ఆడిట్ సర్టిఫికేషన్ సమస్యలను గుర్తించడం పరిష్కరించడం ద్వారా మహిళలకు సురక్షితమైన సమగ్ర వాతావరణం సృష్టించడానికి సంస్థలకు సహాయపడుతుందని తెలిపారు. చక్కని విద్యాసేవలను అందిస్తున్నందుకు, అకడమిక్ అడ్మినిస్ట్రేషన్ సమర్థవంతమైన నిర్వహణకు ఈసర్టిఫికెట్లు ప్రతీకగా ఉంటాయని చెప్పారు. హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధిపతి ఆలపాటి శివయ్య మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో రెండురోజులు పాటు నిర్వహించిన ఆడిట్ ప్రక్రియకు సంతృప్తి చెందామని, దానికి నిదర్శనంగా ఫైవ్‌స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్ అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఫ్యాకల్టీ అసోసియేట్ ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశ




రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలను విస్తరించేందుకు అవసరమైన కేంద్ర సహకారంపై మంగళవారం పార్లమెంట్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ప్రశ్నించారు. ఆయన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ స్పందిస్తూ దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న సమగ్ర క్యాన్సర్ కేర్ కార్యక్రమాలు, ఆంధ్రప్రదేశ్‌కు వాటి ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ఆధునిక వైద్యం, ఆయుష్ చికిత్సలను కలిపి రోగులకు సమగ్ర సహాయం అందించే విధానాన్ని కేంద్రం బలంగా ప్రోత్సహిస్తోందన్నారు. ఇందు కోసం కొట్టక్కల్ ఆయుర్వేద వైద్యశాల, ముంబై లోని టాటా మెమోరియల్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఏఐఐఏ-ఏఐఐఎంఎస్ ఝూజ్జర్, గోవా మెడికల్ కాలేజీలలో సంయుక్త పరిశోధన యూనిట్లు పని చేస్తున్నాయని వివరించారు. 2017-20 మధ్య కృష్ణా జిల్లాలో అమలు చేసిన సీసీఆర్‌హెచ్- డీజీహెచ్‌ఎస్ పైలట్ ప్రాజెక్టు హోమియోపతి, యోగా పద్ధతులను అనుసరించి క్యాన్సర్ రోగులకు సాయం అందించిందని, ఈ ప్రాజెక్టు ఏపీలో సమగ్ర చికిత్సకు మంచి పునాది వేసిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీనిపై ఎంపీ సతీష్‌బాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో ఆరోగ్య రంగంలో సమగ్ర వైద్య విధానాలపై తీసుకుంటున్న చర్యలకు అనుకూలంగా కేంద్రం ఇచ్చిన సమాధానం రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ చికిత్సకు కొత్త దిశ కానుందన్నారు. రాష్ట్రంలో మరిన్ని జిల్లాలకు సమగ్ర క్యాన్సర్ చికిత్స సౌకర్యాలను విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. సమగ్ర వైద్యం రోగుల ఆరోగ్యానికే మాత్రమే కాకుండా, కుటుంబాలకు ధైర్యం ఇస్తుందన్నారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తానని ఎంపీ సతీష్‌బాబు వెల్లడించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.





కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

\- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

\- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్ర్కీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే




రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ



రణ్‌వీర్ క్షమాపణలు

కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజీతో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.



వినూత్నంగా వన్ బై ఫోర్

నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది.

ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

భక్తులకు విజ్ఞప్తి...



అన్నవరం ఆలయ ప్రాంగణంలో సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్న అధికారులు

- అన్నవరం దేవస్థానంలో సేవలు, వ్రతాల టిక్కెట్ల ఆన్‌లైన్ విధానంపై విస్తృత ప్రచారం
- ముఖ్య ప్రదేశాల్లో సైన్‌బోర్డులు
- ప్రజలకు తగ్గనున్న నిరీక్షణ

అన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలు, దేవదాయశాఖ సూచనలతో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ బుకింగ్, దర్శనాలు, వసతి, ప్రసాదం ప్యాకెట్ల కొనుగోలు తదితర అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. దేవదాయశాఖలో కేవలం 2శాతం మంది మాత్రమే ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుంటున్నారని సర్వేలో తేలడంతో అధికశాతం భక్తుల దర్శనాలు, ప్రసాదాల కొనుగోలు వద్ద, వసతి కేటాయింపు సమయంలో అధికసమయం నిరీక్షణ చేస్తుండడంతో అంతా ఆన్‌లైన్ విధానం తీసుకువచ్చారు. దీనిని విస్తృతంగా భక్తుల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతను ఆయా దేవస్థానాలకు అప్పగించింది. దీంతో అన్నవరం ఆలయ ప్రాంగణంలో ముఖ్యప్రదేశాలు, ఇతర ప్రాంతాలతో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం తో పాటుగా ఉద్యోగులు తమ ఫోన్లలో స్టేటస్‌లలో పెడుతున్నారు. భక్తులు ఆన్‌లైన్ విధానం సద్వినియోగం చేసుకుంటే నిరీక్షణ సమయం చాలా తగ్గుతుందని అధికారులు తెలిపారు.

అంతర్వేదిలో కూడా..

అంతర్వేది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆదేశాల మేరకు కమిషనర్ సూచనలు అనుసరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనసింహస్వామి ఆలయంలో దేవస్థానానికి సంబంధించి వసతి గదులు, దర్శనాలు, అభిషేకం, సుదర్శన హోమం, ఇతర సేవల బుకింగ్‌లు, ప్రసాదం టోకెన్ల విక్రయాలు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆన్‌లైన్ ద్వారా వివిధ సేవలు, దర్శనాల టిక్కెట్లను బుక్ చేసుకునే విధానంలో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఏపీటెంపుల్స్ ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆలయంలో జరిగే సేవలను ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. అన్నదాన, గోసంరక్షణ వంటి పథకానికి విరాళాలు, క్రెడిట్, డెబిట్ కార్డులు, గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్ యూపీఐ ద్వారా చెల్లించవచ్చని చెప్పారు.

శివాలయంలో నాగుపాము ప్రత్యక్షం


పగడ విప్పి ఉన్న నాగుపాము, చూస్తున్న ప్రజలు

చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

రౌతులపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలోని పురాతన శివాలయంలో మంగళవారం నాగుపాము ప్రత్యక్షమైంది. శివలింగం దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించింది. తలుపులు వేసి ఉండడంతో వెనుదిరిగి నందీశ్వరుడి వద్ద సుమారు 3 గంటలసేపు ఉం డిపోయింది. విషయం తెలిసి గ్రామస్తులు నాగుపామును చూసేందుకు తరలివచ్చారు. వారు చూస్తుండగానే గుడి వెనుక నుంచి వెళ్లిపోయింది.

సాగుకు సంరక్షణ ఏది?

జీడిమామిడిని సంరక్షించుకోలేని దుస్థితిలో గిరిజనం

యంత్రాలూ, స్ప్రేయర్లు, ఉపకరణాలు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

రంప మన్యంలోని గిరిజనం తమ సాంప్రదాయ జీడిమామిడి సాగును సంరక్షించుకోలేని దుస్థితిలో ఉన్నారు. మన్యం 12 మండలాల్లో సుమారు 50 వేలకుపైగా ఎకరాల్లో జీడిమామిడి సాగును గిరిజనులు కొనసాగిస్తున్నారు. అయి తే జీడిమామిడికి పట్టే తెగుళ్లను నివారించుకోవడంలో సాయం అందక, తమ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక ఇక్కడ జీడిమామిడి రైతాంగం నిర్దిష్టమైన ఆదాయాన్ని పొందలేకపోతున్నారు. దీంతో ఈ జీడిమామిడి తోటలను సొంత ఖర్చులతో నిర్వహించుకునే స్థోమత లేక ఇతరులకు తోటలను లీజులకు ఇచ్చేసి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కోసం వెతుకులాడుతున్నారు. మరికొందరైతే జీడిమామిడి పిక్కల కొనుగోలుదార్ల నుంచి అడ్వాన్సులు తీసుకుని పంటను సంరక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అనక పంట చేతికి వచ్చాక కొనగోలుదారులు ఇచ్చిన అడ్వాన్సుకు వడ్డీతో కలిపితే రైతుల చేతులకు వచ్చేది శూన్యంగా ఉంటోంది.



తెగుళ్ల బెడద...

ప్రస్తుతం మన్యంలో జీడిమామిడి తోటలన్నీ పువ్వులుతొడిగి పరిపక్వానికి సిద్ధమవుతున్నాయి. శీతాకాలం కావడంతో తేనె మంచు తెగులు, ఇతర తెగుళ్లు పడుతుండగా మరోపక్క కోతుల బెడద కూడా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తోంది. తెగుళ్లకు మందులను, వాటిని పిచికారీ చేసుకోవడానికి యంత్రాలూ, స్ప్రేయర్లు, ఇతర ఉపకరణాలను కొనుగోలు చేసుకోలేక దిక్కుతోచని స్థితిలో గిరిజనులు నలిగిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ఇదే దుస్థితిని ఎదు ర్కొన్నారు. కూటి ప్రభుత్వం పాలనలో ఏడాదిన్నర గడిచినా అధికారుల తీరులో మార్పు లేదు. ప్రభుత్వం రైతాంగానికి అన్ని విధాలా సహకరించాలని స్పష్టం చేస్తున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. వీరికి అవసరమైన సాయాన్ని అందించే సానుకూల పరిస్థితులు లేక, జీడిమామిడి తోటలకు పడుతున్న తెగుళ్లను కూడా నివారించలేకపోతున్నారు. ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం గుర్తించి తమను ఆదుకుని జీడిమామిడి తోటలను కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.

వైద్యం అందలేదు.. ప్రాణం ఆగలేదు!


మరణించిన మాణిక్యం



తాళాలు వేసి ఉన్న చేబ్రోలు పీహెచ్‌సీ

- హోటల్ కార్మికుడికి గుండె నొప్పి
- చేబ్రోలు పీహెచ్‌సీకి తాళాలు
- 108 వచ్చేసరికే మృతి

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 24గంటలు వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళాలు వేసి ఉండడంతో సకాలంలో వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం జరిగింది. దీంతో పీహెచ్‌సీ వైద్యుడిని సస్పెండ్ చేయగా, స్టాఫ్‌నర్సుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

చేబ్రోలు గ్రామంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న శరభవరం గ్రామానికి చెందిన ఇమ్మంది మాణిక్యం(56) తెల్లవారుజామున 2గంటల సమయంలో గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో చేబ్రోలు పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అయితే పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడంతో సిబ్బంది ఎవ్వరు లేరు. దీంతో 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేయగా గంట తర్వాత వచ్చింది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. 24గంటలు పనిచేయాల్సిన పీహెచ్‌సీ మూసి ఉండడంతోనే వైద్యం అందక మాణిక్యం మరణించినట్లు స్థానికులు తెలిపారు. ఇక్కడ పని చేసే సిబ్బందిలో నలుగురిని ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్ వేయడంతో పాటు వైద్యుల్లో ఒకరు సెలవులో ఉండడంతో పీహెచ్‌సీలో ఎవ రు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడినట్లు వా రు చెప్పారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే ఒకరు మరణించినట్లు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, టీడీపీ నాయకుడు బత్తుల శ్రీను ఆరోపించారు. మరోవైపు టీడీపీ, జనసేన నాయకులు పీహెచ్‌సీని పరిశీలించారు.

డీఎంహెచ్‌వో విచారణ

వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటనపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయ అధికారులు ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్ చేబ్రోలు చేరుకుని విచారణ చేపట్టారు. ఆరునెలల నుంచి సిబ్బంది కొరతపై ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించలేదని గ్రామస్తులు ప్రశ్నించారు. పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యాధికారి సస్పెన్షన్

పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉండడం, వైద్యం అందక వ్యక్తి మరణించిన సంఘటనలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిరతన్‌ను డ్యూటీ రోస్టర్ వేయడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందులకు గానూ సస్పెండ్ చేసినట్టు డీఎంహెచ్‌వో మంగళవారం రాత్రి తెలిపారు. అదేవిధంగా స్టాఫ్‌నర్సుకు షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు. ఇద్దరు వైద్యులకు గానూ ఒక వైద్యుడు డాక్టర్ వి.నిఖిల్ సెలవులో ఉన్నట్లు చెప్పారు. డిప్యూటేషన్‌పై ఉన్న స్టాఫ్‌నర్సును తక్షణం చేబ్రోలులో రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పీహెచ్‌సీలో వైద్యసేవలు అందించేందుకు తాళ్లరేవు నుంచి డాక్టర్ ఎల్ సురేష్‌కుమార్ చేబ్రోలుకు డిప్యూటేషన్‌పై నియమించినట్లు చెప్పారు. కాగా సిబ్బంది కొరత, డిప్యూటేషన్లపై ఫిర్యాదు చేసినా ఆరునెలలుగా స్పందించని జిల్లా అధికారులు ఇప్పుడు సంఘటన వెలుగులోకి రాగానే చర్యలు తీసుకోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


పీహెచ్‌సీలో విచారణ జరుపుతున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

బంతి తోట తొలగింపు


బంతి తోట తొలగిస్తున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముహూర్తాలు వెళ్లిపోయి మూఢం రావడంతో పూల రైతులు డీలా పడ్డారు. బంతిపూల రేటు కిలో రూ.15కి పడిపోయింది. దీంతో బంతి తోట కొనసాగిస్తే మరింత నష్టాలు వస్తాయనే ఉద్దేశంతో తొలగించి చామంతి వేయడానికి సిద్ధమవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన బండారు నారాయణ ఇదే చేశాడు. ట్రాక్టర్‌తో తన బంతి పంటను తొలగించాడు. ఆ దృశ్యమే ఇది.

కాంగ్రెస్‌కు కొండేటి చిట్టిబాబు రాజీనామా


చిట్టిబాబు

పి.గన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజవకర్గ మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు వివరాలను ఫోన్‌లో విలేకర్లకు వెల్లడించారు. గతనెల 30న తన రాజీనామాను ఏపీసీసీ అధ్య క్షురాలు షర్మిలారెడ్డికి పంపించానని తెలిపారు. ఇప్పటివరకు పార్టీలో సేవలందించేందుకు సహకరించిన కాంగ్రెస్ పెద్దలు, ఏపీసీసీ అధ్యక్షురాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు. అలాగే కోనసీమ జిల్లాలో 7 నియోజకర్గాల ఇంచార్జ్‌లు, నాయకులు, కార్యకర్త లకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన ఏ పార్టీలో చేరబోతున్నానో త్వరలో ప్రకటిస్తానని స్పష్టం చేశారు. చిట్టిబాబు కాంగ్రెస్‌పార్టీతో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనంతరం వైసీపీ ఆవిర్భావం నుంచి వైసీపీలో ఉంటూ 2019-24 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2024లో వైసీసీ నుంచి సీటు దక్కకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా బరిలో నిలబడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి కూడా రాజీనామా చేశారు. అయితే ఆయన కూటమి ప్రభుత్వం వైపు చూస్తున్నారని, త్వరలో టీడీపీ అధినాయకుడు సమక్షంలో ఆ పార్టీలో చేరబోతున్నట్టు జోరుగా ప్రచారం సాగుతుంది.

విద్యార్థుల పట్ల కులవివక్షత...

ముగ్గురు ఉపాధ్యాయులపై బదిలీవేటు

కొత్తపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల కులవివక్షత చూపుతున్నారనే కారణాలతో ముగ్గురు ఉపాధ్యాయులపై విద్యాశాఖాధికారులు బదిలీవేటు వేశారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల పట్ల కులవివక్షత చూపుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చేపట్టడం విదితమే. ఈ నేపథ్యంలో యండపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విచారణ నిర్వహించి ముగ్గురు ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి హెచ్ఎమ్ జి.సురేష్ భూషణంను శంఖవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.శ్రీనుబాబును కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు బి.ప్రసాదరావును రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ చేసినట్టు ఎంఈవోలు వేణుగోపాల్, పైడిరాజు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

కాజులూరు (కరప), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం దుగ్గుదుర్రు గ్రామానికి చెందిన కౌలు రైతు కొప్పిశెట్టి అన్నవరం (67) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసుల సమాచారం మేరకు.. దుగ్గుదుర్రులో మూడున్నర ఎకరాల పొలాన్ని అన్నవరం గత కొన్నేళ్లుగా కౌలుకు సాగుచేస్తున్నాడు. ఆదివారం పొలానికి వెళ్లిన అన్నవరం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబసభ్యులు ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం సాగుచేస్తున్న పొలానికి సమీపంలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పల్లో అతడి మృతదేహాన్ని గుర్తించారు. అన్నవరం ఒంటికి విద్యుత్ వైర్లు చుట్టుకుని ఉండడంతో విద్యుద్ఘాతం వల్లే మృతిచెందినట్టు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్, ట్రాన్స్‌కో, రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

రంగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం రామేశంపేటలో జరిగింది. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రామేశంపేటకు చెందిన పిల్లల తాతబ్బాయి (51) తన ఇంటిపై రెండోఫ్లోర్ నిర్మిస్తున్నాడు. ఆ పనులు ఎంతవరకు వచ్చాయో చూద్దామని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటిపైకి వెళ్లి పిట్టగోడ దగ్గర నుంచి పరిశీలిస్తుండగా పిట్టగోడ పక్క నుంచి వెళ్తున్న కరెంట్‌తీగ తగిలి షాక్‌తో అక్కడికక్కడే మరణించాడు. అతడి కుమారుడు కిషోర్ ఇచ్చినఫిర్యాదుతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ద్రాక్షారామ, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వర థియేటర్ కాంప్లెక్సు ఎదురుగా అరుగుపై మంగళవారం ఉదయం సుమారు 70 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడు. అతడు గత 20 ఏళ్లుగా చిత్తుకాగితాలు ఏరుకుంటూ, భిక్షమెత్తుకు జీవిస్తున్నాడని స్థానికులు చెప్తున్నారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచాయతీ సహకారంతో శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

పంటకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కిర్లంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనే పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి వేలంక వీఆర్వోకు తెలిపారు. ఆయన కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించారు. కిర్లంపూడి హెడ్ కానిస్టేబుల్ ఎవి.మూర్తి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంటకాలువలో ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేనివిధంగా చేరుకుంది. మృతుడి వయసు సమారు 45ఏళ్లు ఉంటుంది.. మృతదేహంపై బ్లూ టీ షర్టు, షార్ట్ ఉన్నాయి. ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించామని, సమాచారం తెలిసిన వారు జగ్గంపేట సీఐ నెంబర్ 9440796529, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ 9440904834 నెంబర్‌లకు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

ద్రాక్షారామ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ నున్నవారి వీధికి చెందిన పలివెలి సావిత్రి (30), తన చిన్నకుమార్తె పూర్ణసాయిక్షిత(7)తో కలసి అదృశ్యమైనట్టు భర్త పలివెల జ్యోతిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జ్యోతిబాబు సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో ఇంటికి కిరాణా సరుకులు తీసుకెళ్లగా సావిత్రి మరికొన్ని సామన్లు తేవాలని కోరింది. జ్యోతిబాబు ఒకేసారి తీసుకురమ్మని చెప్పవచ్చుగా అని కేకలు వేసి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి వచ్చేసరికి సావిత్రి, చిన్న కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల వారిని అడుగగా చిన్న కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయిందని చెప్పారు. దీంతో జ్యోతిబాబు అత్తగారికి ఫోన్ చేయగా తమ ఇంటికి రాలేదని చెప్పారు. బంధువుల ఇంట్లో గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో ద్రాక్షారామ పోలీసులకు జ్యోతిబాబు ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.

అన్నివర్గాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు

మాదిగ అనుబంధ కులాలకు కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాల సేవలు చిరస్మరణీయం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


నడిపూడిలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అమలాపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలను అన్నివర్గాల వారు అనుభవించాలని రాజ్యాంగపరంగా నిర్దిష్టంగా ఉందని అందుకే అత్యున్నత న్యాయస్థానం సైతం మాదిగ అనుబంధ కులాలకు న్యాయం చేసేలా తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలను ప్రతీ ఒక్కరు అనుభవిస్తూ ఇతర వర్గాలవారితో పోటీపడుతూ అవసరమైతే జనరల్ కేటగిరిలో సైతం ఆధికత్యను సాధించి గొప్పవారిగా నిలవడమే రాజ్యాంగ లక్ష్యమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మంగళవారం జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన భారీ ర్యాలీగా పురవీధుల మీదుగా నడిపూడిలోని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాస్థాయి మాదిగ అనుబంధసంఘాల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధమైన హక్కులను జాతీయస్థాయిలో పొందడానికి దశాబ్దాలు పట్టాయని వివరించారు. వర్గీకరణ ఫలితాలు పొందుతూనే చదువుల్లో ప్రతీ మాదిగ బిడ్డ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ కేబీ మధుమాదిగ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల సమావేశం మంగళవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ అనుబంధ కులాలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు కూటమి ప్రభుత్వం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అనుకూలంగా ఎవరు ఉన్నారు, వ్యతిరేకంగా ఎవరు వ్యవహరిస్తున్నారు గుర్తించాలని సూచించారు. తొలుత ముక్కామల సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తొత్తరమూడి గోవిందు మందకృష్ణకు భారీ గజమాలతో స్వాగతం పలికారు. సమావేశంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మున్నంగి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్, జాతీయ నాయకులు డాక్టర్ దూళ్లపల్లి సుబ్బారావు మాదిగ, పేరెల్లి ఎలీషా మాదిగ, జిల్లా ఇన్‌చార్జి పి.మధు, ఇన్‌చార్జి డాన్ సూరిమాదిగ, జాతీయ నాయకులు ముమ్మిడివరపు చినసుబ్బారావు, ఉందుర్తి వెంకట్రావు, రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ ఇన్‌చార్జిలతో పాటు నాయకులు ఆకుమర్తి రమేష్, డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు, డైరెక్టర్లు తొత్తరమూడి ప్రభాకరరావు, చాట్ల సత్యనారాయణ, కాప నాగభూషణం, మండ వెంకటేశ్వరరావు, కొడమంచిలి సాయికుమార్, ఈతకోట రాజు పాల్గొన్నారు.

వాటర్ కండక్టర్ సిస్టం పనులకు

నీటి విడుదల నిలిపివేశాం

సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు


పూజలు చేసి కొబ్బరికాయ కొడుతున్న సీఈ రాజారావు

మోతుగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 5,6 యూనిట్లకు పెన్‌స్టాక్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు పంపించే క్రమంలో వాటర్ కండక్టర్ సిస్టం పనులను ప్రారంభించడానికి మంగళవారం ఉదయం నుంచి డొంకరాయి నుంచి కెనాల్ నీటి విడుదలను నిలిపివేశామని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ కేవీ రాజారావు పేర్కొన్నారు. ఫోర్‌బై ఇంటెక్ డ్యాం వద్ద జాన్ అండర్ వాటర్ డైవింగ్ బృందంతో గేట్లను దించి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టామన్నారు. ఇంటెక్ డ్యాం దిగువన ఉన్న 5.5 కిలోమీర్ల పొడవున గల టన్నెల్ గేట్లను కూడా అండర్ వాటర్ డ్రైవింగ్ బృందం దించిన తరువాత లీకేజీలు లేకుండా సీల్ వేస్తారని, అనంతం టన్నెల వద్ద అవుట్ లెట్ నుంచి 5,6 యూనిట్లకు నీరు పంపించడానికి అవసరమైన కండక్టర్ సిస్టం పనులు పనులు ప్రారంభించడానికి పీఈఎస్ కంపెనీ ఏర్పాట్లను చేసుకుంటున్నారని తెలిపారు. ఇంటెక్ డ్యాం వద్ద మెదటిగా సీఈ రాజారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో విజయవాడ విద్యుత్ సౌదా హైడల్ సీఈ రవీం ద్రరెడ్డి, ఎస్ఈలు (సివిల్) శ్రీనివాసరెడ్డి, చిన్నకా మేశ్వరరావు, ఈఈలు బాలకృష్ణ, నాగశ్రీనివాస రావు పాల్గొన్నారు.

నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

పొల్లూరు 5,6 యూనిట్లకు నీటి సరఫరా పనులకు కెనాల్ నుంచి నీటి విడుదలను నిలిపివేయడంతో మంగళవారం ఉదయం నుంచి పొల్లూరు, డొంకచాయి జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు.

గడవాలి పూట.. తప్పదు వేట..



దిత్వా తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గనేలేదు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఈదురుగాలులు వీస్తూనే ఉన్నాయి. చిరుజల్లులు కురుస్తున్నాయి. సముద్రం ఒక మోస్తరు అల్లకల్లోలంగా ఉంది. ఎన్ని ఇబ్బందులున్నా తగ్గేదేలే అంటూ తీరప్రాంతానికి చెందిన మత్స్యకారులు మంగళవారం ఉదయం సముద్రంలోకి వేటకు వెళ్లారు. ప్రతికూల వాతావరణం ఉన్నా పర్వాలేదు ఎంతోకొంత ఆదాయం వస్తే తమకు రోజు గడుస్తుందని చెప్తున్నారు. - కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

ఆహ్లాదకరంగా రెండో రోజు స్కేటింగ్ పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వివేకానంద పార్క్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో 69వ అంతర్ జిల్లాల స్కేటింగ్ చాంపియన్‌షిప్ అండర్ 11, 14, 17,19 క్యాటగిరీలలో టోర్నమెంట్ కం సెలెక్షన్స్ పోటీలు రెండో రోజు మంగళవారం ఆహ్లాదకరంగా సాగాయి. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ అడ్మిన్ సెక్రటరీ పి.సుధారిణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, చీఫ్ గెస్ట్‌గా ఐపి మహబూబ్ బాషా, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ పి.రవిచంద్ర విజేతలకు మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో లంక జార్జ్, రాష్ట్ర హాకీ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి వి.రవి రాజ్ పాల్గొన్నారు.


స్కేటింగ్ చేస్తున్న బాలలు

దిత్వా తుఫాన్..రైతన్నల్లో ఆందోళన


గుమ్మళ్లదొడ్డిలో ధాన్యాన్ని వ్యాన్‌లోకి లోడు చేస్తున్న దృశ్యం

గోకవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం రైతన్నల గుండెల్లో అలజడి రేపుతోంది. నూర్పిడి చేసిన ధాన్యం రాశులు కల్లాలలో, రోడ్ల వెంబడి ఆరబెట్టడంతో రక్షించుకునేం దుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. మొంథా తుఫాన్ గాయం ఇంకా మానలేదని, ఇంతలోనే దిత్వా గండం వచ్చిపడిందంటూ అన్నదాతలు విలవిలలాడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడక్కడ చిరజల్లులు పడడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి. ఇప్పటికే కోతలు పూర్తై తేమ శాతం తగ్గించుకునేందుకు ఆరబెట్టిన ధాన్యాన్ని దిత్వా తుఫాన్ నుంచి కాపాడుకునేందుకు రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు పరిగెడుతున్నారు. కొందరు ఆదరబదరాగా ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తరలిస్తుండగా మరికొంతమంది రైతులు తుఫాన్ ప్రభావం తగ్గే వరకు బరకాలు, టార్పిన్‌లు కింద దాస్తున్నారు. కొన్నిచోట్ల వరి పైరు నేలవాలినట్టు పలువురు రైతులు చెప్పుకొస్తున్నారు.

18 కిలోల గంజాయి స్వాధీనం

ఆరుగురి అరెస్ట్, మరో ఆరుగురు పరారీ

కోరుకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపురం-కణుపూరు రోడ్డులో హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో రూ.40 వేలు విలువైన 10 కిలోల గంజాయిని కొనుగోలు చేసి మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా చెల్లించడానికి అంగీకరించి అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ఎస్ఐ నాగార్జున సిబ్బందితో దాడిచేసి అరెస్టు చేశారు. ఒక కారు, 5 సెల్‌ఫోన్‌లు, 10.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కణుపూరు వైపు వెళుతుండగా నర్సాపురం రోడ్డులో పరదేశమ్మగుడి దగ్గరలో మరో ఆరుగురు అనుమానాస్పదంగా ఒక సంచితో కనబడ్డారు. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వారిలో ముగ్గురు పారిపోగా ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి 7.800 కిలోల గంజాయిని, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఏ4గా ఉన్న వెంకట సురేష్‌ను విచారించగా తాము గంజాయిని ధారకొండ గ్రామానికి చెందిన అనీల్ వద్ద తన స్నేహితుడు జగ్గంపేటకు చెందిన నక్కా నాగేంద్ర, సుధీర్‌లతో తాను కలిసి కొనుగోలు చేసినట్టు పోలీసులకు తెలిపాడు. ఈ కేసులో గోకవరం గ్రామానికి చెందిన హంసబర్గాల విష్ణు, ఆవుల చందు, హంసబర్గాల భూసి, ధారకొండకు చెందిన అనిల్, జగ్గంపేటకు చెందిన నక్కా నాగేంద్ర, సుధీర్ పరారీలో ఉన్నారని సీఐ సత్యకిశోర్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ప్రతిభ కనబరిచిన ఎస్ఐ నాగార్జున, హెచ్‌సీ వి.శ్రీను, కానిస్టేబుల్స్ డి.సత్తిరెడ్డి, వరప్రసాద్, బి.బాపినాయుడు, ప్రకాష్ రెడ్డిలను నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ అభినందించారు.

సింహాచల్‌నగర్‌లో రూ.42.5 లక్షలతో పార్కు అభివృద్ధి


శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సింహాచల్‌నగర్‌లో రూ.42.50 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సింహాచల్‌నగర్‌లో అధ్వానంగా ఉన్న పార్కును ఆరోగ్య రాజమహేంద్రవరంలో భాగంగా తీర్చిదిద్దుతామన్నారు. గతంలో సింహచల్‌నగర్‌లోకి ప్రవేశించే ప్రాంతంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా టిడ్కో ఇళ్లు ఇచ్చేసి ఫొటోలు దిగారని, డ్రైనేజీలు లేవని, శ్లాబులు లీకవుతున్నాయని అన్నారు. ఆరోగ్య రాజమహేంద్రవరంలో భాగంగా క్రమం తప్పకుండా రెండు నెలలకో సారి డ్రైన్స్ అన్నీ డీసిల్టింగ్ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నగర ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, మరుకుర్తి రవియాదవ్, నగర పాలక సంస్థ ఈఈ మదర్షాలీ తదితరులు పాల్గొన్నారు.

పేదలను తక్షణమే ఆదుకునేందుకు ఎల్‌వోసీ పంపిణీ


లబ్ధిదారులకు ఎల్‌వోసీలు అందజేసిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పేదలను తక్షణమే ఆదుకునే విధంగా అత్యవసరమైన వారికి ఎల్‌వోసీలు అందిస్తూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు.నియోజకవర్గంలోని పలువురికి వైద్యం నిమిత్తం మంజూరైన సీఎం సహాయ నిధి ఎల్‌వోసీలను మంగళవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కొంతమూరుకు చెందిన సయ్యద్ బషీరమ్మకు రూ.2 లక్షలు, మాధవరా యుడుపాలేనికి చెందిన లావేటి ఐలకు రూ.2 లక్షలు, కాతేరుకు చెందిన కూచిపూడి శారదకు రూ.3,21,700, హుకుంపేటకు చెందిన బండి శ్రీలక్ష్మికి రూ.1,86,200, పొట్టిలంకకు చెందిన పట్టపగలు విజయకుమార్‌కు రూ.26,166 ఎల్‌వోసీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ వర్తించక అత్యవసర వైద్యం అవసరమై అవస్థలు పడుతున్న పేదవారికి తక్షణమే ఎల్‌వోసీ రూపంలో సీఎం సహాయనిధి అందిస్తున్నామన్నారు. వైద్య ఖర్చులు చెల్లించి చికిత్స చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నామరు. ఈ కార్యక్రమంటో వాసిరెడ్డి రాంబాబు, నున్న కృష్ణ, షేక్ ఖాసియ, కలిదిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ క్విజ్‌కు విజయ్‌వర్ధన్ ఎంపిక

కడియం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాధవరాయుడుపాలెం చైతన్యనగర్ ఉన్నత పాఠశాల నుంచి 9వ తరగతి విద్యార్థి యజ్జల వీర వెంకట విజయ్‌వర్ధన్ ప్రభుత్వం నిర్వహించిన కౌశల్ జిల్లా స్థాయి సైన్సు క్విజ్‌లో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికయినట్టు హెచ్‌ఎం ఎం.వెంకటకృష్ణకామేశ్వరి తెలిపారు. ఈ నెల 27న తిరుపతిలో జరిగే భారతీయ విజ్ఞాన సమ్మేళనం రాష్ట్రస్థాయి పోటీల్లో విజయవర్ధన్ పాల్గొననున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విజయ్‌వర్ధన్‌కు సర్పంచ్ అన్నందేవుల చంటి సైన్సు పుస్తకం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ గండి స్వామిప్రసాద్, మహ్మద్ సెహన్నాషరీఫ్, పాఠశాల కమిటీ మల్లవరపు నాగమణి, కౌశల్ కోఆర్డినేటర్ సీహెచ్‌ఎస్ భరద్వాజ పాల్గొన్నారు.

6 నుంచి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు

దివాన్‌చెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఈనెల 6వతేదీ నుంచి అమలవుతుందని రాజానగరం ఎంఈవో-2 జ్యోతిప్రసాద్ మంగళవారం తెలిపారు. 2026 మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఈ ప్రణాళిక అమలు జరుగుతుందని చెప్పారు. ఏ,బీ గ్రేడ్, సీ,డీ గ్రేడ్ విద్యార్థులకు అమలు చేయవలసిన సిలబస్‌కు సంబంధించి షెడ్యూల్ ఉన్నతాధికారుల నుంచి విడుదలవుతుందని చెప్పారు. ఆ మేరకు ప్రతిరోజూ ఒక సబెక్టు బోధించి సాయంత్రం పరీక్ష నిర్వహిస్తామన్నారు. మండలంలో విద్యార్థులంతా నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని ఎంఈవో పేర్కొన్నారు.

మహాన్నదానంతో ముగిసిన షష్ఠి ఉత్సవాలు


ఆహారపదార్థాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో గత నెల 25న ప్రారంభమైన కుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు మంగళవారం రాత్రి జరిపిన మహాన్నదానంతో ముగిశాయి. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన షష్ఠి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి పద్మజ, పారిశుధ్య కార్మికులను సత్కరించారు. తొండాపు నాగసుబ్బారెడ్డి శిరీష(యూఎస్ఏ) దంపతుల సహకారంతో అన్నదానం చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, చాగంటి సాయిబాబారెడ్డి, నందిపాటి కిషోర్, త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీను, వెంకన్నబాబు పాల్గొన్నారు.

యువతరం సేవా ధర్మాన్ని అలవరచుకోవాలి

అనపర్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): యువతరం సేవా ధర్మాన్ని అలవరచుకోవాలని రామకృష్ణ మఠం కడప అధ్యక్షుడు స్వామి అనుపమానందజీ మహరాజ్ అన్నారు. స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల ప్రాంగణలో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస సదస్సుకు ఆయన విచ్చేసి ప్రసంగించారు.మరో అతిథి స్వామి సేవ్యానందజీ మహరాజ్ ప్రసంగిస్తూ ప్రతి జీవిలోను భగవంతుడు ఉన్నాడని, సాటి మనిషికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్టేనన్నారు.సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రామకృష్ణ మిషన్ ప్రతినిధి దుర్గాప్రసాద్, సమితి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రహణం వీడేనా!

- సీతానగరంలో నిరుపయోగంగా స్కేటింగ్ పార్కు స్థలం
- ప్రభుత్వం మారితే రంగు మారుతున్న వైనం
- లక్షలాది రూపాయలు వృథా
- పంచాయతీ నిర్లక్ష్యం
- ఆదాయానికి గండి


సీతానగరంలో తుప్పలతో మూసుకుపోయిన స్కేటింగ్ పార్కు

సీతానగరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన సీతానగరంలో నాలుగుబొమ్మల సెంటర్ వద్ద నున్న గొయ్యికి గ్రహణం పట్టినట్టుంది. ఆ ప్రాంతంలో ఏది ప్రారంభించినా కార్యరూపం దాల్చడం లేదు. గత టీడీపీ హయాంలో స్కేటింగ్ పార్కుకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెట్రోల్ బంక్‌కు ఏర్పాట్లు చేసింది. ఏదీ ఫలించలేదు. పైగా వాటి కోసం చేసిన వృథాగా పోయింది. సీతానగరంలో నాలుగుబొమ్మల సెంటర్ వద్ద గతంలో ఉన్న గొయ్యి సీతానగరం, లంకూరు, చినకొండేపూడి గ్రామాలకు చెందిన మురుగునీరు పోవడానికి ఉపయోగకరంగా ఉండేది. ఇక్కడ అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుందని లక్షల ఖర్చుతో స్కేటింగ్ పార్కుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ సర్కిల్ ఆకారంలో దిమ్మ కట్టారు. ఇంతలో ప్రభుత్వం మారింది.


మాంసం దుకాణాలు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

వైసీపీ ప్రభుత్వం రావడంతో సీతానగరం సహకారం సంఘం ఇక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసి సంఘానికి ఆదాయం పెంచుతామంటూ ముందుకు వచ్చి సీతానగరం పంచాయతీ వద్ద ఆ స్థలాన్ని లీజుకు తీసుకుని స్కేటింగ్ పార్కును పక్కన పడేసి పంచాయతీ నుంచి నెలకు రూ.15 వేలు అద్దె ఇచ్చేలా ఆ స్థలాన్ని లీజుకు తీసుకుని పెట్రోల్ బంకు కోసం బిల్డింగ్ కట్టారు. లక్షలాది రూపాయలు వ్యయంతో ఏర్పాట్లు చేశారు. అనంతరం చినకొండేపూడి గ్రామానికి చెందిన నకుల సురేష్ అనే న్యాయవాది పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందని గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయడంతో పనులు నిలిచిపోయాయి. గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఉండడంతో తదుపరి దానిని వదిలేశారు. దానితోపాటు మిగిలిన స్థలం కూడా వదిలేయడంతో ప్రస్తుతం మిగిలిన స్థలంలో కొంత చేపల మార్కెట్‌గాను మిగిలిన స్థలం ప్రైవేటు వాహనాల పార్కింగ్ స్థలంగా మారిపోయింది. చేపలమార్కెట్ స్థలం లీజుకు ఇచ్చివుంటే పంచాయతీకి ఆదాయం వచ్చేది కాని పంచాయతీ నిర్లక్ష్యంగా వదిలేయడంతో దానిని పలువురు ఆక్రమించుకుని చేపలు అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం పంచాయతీకి వచ్చే ఆదాయం పోయింది. స్థలం అన్యాక్రాంతమవుతోంది. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో స్థలం ఆక్రమణలకు గురికావడమే కాకుండా పంచాయతీ ఆదాయానికి గండి పడింది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వాహిని నాగరత్నంను వివరణ కోరగా పంచాయతీ సర్పంచ్ చెబుతారని చెప్పారు. ఆయనను వివరణ కోరగా ఆంజనేయస్వామి గుడి సమీపంలో చేపలు అమ్ముతుండడంతో భక్తులకు ఇబ్బంది కలుగుతోందని, దీంతో ఖాళీ స్థలంలో అమ్ముకోమన్నామని, త్వరలో ఆ స్థలంలో నిర్మించిన దిమ్మలు, స్కేటింగ్ పార్కు తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ కట్టి అద్దెలకు ఇచ్చి పంచాయతీ ఆదాయం పెంచుకునే ప్రయత్నంలో ఉన్నామన్నారు.


పెట్రోల్ బంక్ కోసం నిర్మించిన భవనం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి.. అనపర్తిలో ప్రజా దర్బార్


ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించగా కొన్నింటిపై జిల్లా అధికారులకు ఫోన్ చేసి తెలియజేశారు. ముఖ్యంగా కరెంటు స్తంభాలు, పింఛన్లు, ఇళ్ల నిర్మాణాలు వంటి సమస్యలను అర్జీల ద్వారా అందజేశారు. అలాగే అనపర్తి జీబీఆర్ కళాశాలలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు తొలగించాలని, గాంధీబొమ్మ నుంచి ఐటీసీ యూనియన్ ఆఫీసు వరకు ఆక్రమణలు తొలగించి రోడ్డును వెడల్పు చేయాలని పలువురు ఫిర్యాదులు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో 124 అర్జీలు అందాయని వీటిని సీఎం కార్యాలయానికి అనుసంధానం చేస్తామన్నారు. ఈ సందర్భంగా రంగంపేట మండలం సింగంపల్లికి చెందిన సోమిశెట్టి కమలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, రావాడ నాగు, వెలుగుబంటి సత్తిబాబు, సిరసపల్లి నాగేశ్వరరావు, బిక్కవోలు ఎంపీపీ సుమ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

రంగంపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టారు. వెంకటాపురంలో నిర్మిస్తున్న మంచినీటి బోరుకు, దొడ్డిగుంటలో వెలమర్తి సుధాకర్ స్థలంలో పశువుల షెడ్(గోకులం) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముకుందవరానికి చెందిన ఉపాధి కూలీ కురుకూరి గంగారావు ఇటీవల మృతిచెందడంతో అతడి భార్య వెంకటలక్ష్మికి రూ.50 వేల ఎక్స్‌గ్రేషియాను ఎమ్మెల్యే అందించారు.కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, వెలుగుబంటి సత్తిబాబు, మోదుకూరి గోపాలకృష్ణ, మద్దిపూడి సత్తిబాబు, యడ్ల వీరగణేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య సేవలను బలోపేతం చేయాలి

రంగంపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ ఆశావర్కర్లతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజారోగ్య సేవలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా.. తల్లి-శిశు ఆరోగ్యం, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై ఆశా కార్యకర్తలతో చర్చించారు. తల్లిపాల ప్రాముఖ్యత, జననాంతరం తొలి ఒక గంటలో తల్లిపాలు ఇవ్వాల్సిన అవసరం తెలిపారు. 6 నెలల వరకు పూర్తిగా తల్లిపాలతోనే శిశుపోషణ జరగాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది కె.మేరీ హెలెనా,వి.తులసీదాస్,వి.నాగలక్ష్మీ,ప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సీతానగరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) మండలంలోని పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన పదేళ్ల మల్లి సాత్వికకనిపించడం లేదని బాలిక పెదనాన్న మల్లి బాపిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డిరామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మాటలు సరిగా పలకలేని సాత్విక సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వీధిలో తోటి పిల్లలతో ఆటలాడింది. ఆ తరువాత నుంచి కనిపించలేదు. బంధువుల ఇంట వాకబు చేసినా ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సాత్విక ఆచూకీ తెలిసిన వారు 94409 01832, 94409 04829 నెంబర్లుకు తెలియజేయాలని రామ్‌కుమార్ కోరారు.

అడవి పంది దాడి.. గాయాలు

గోకవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అడవి పంది దాడిలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన ఎం.గంగరాజు సోమవారం పొలంలో కూలి పనికి వెళ్లాడు.సాయంత్రం 5 గంటల సమయంలో అకస్మాత్తుగా పిల్ల పంది గంగరాజుపై దాడి చేసింది. దీంతో మోకాలు, ఎడమ కాలు తొడ భాగాన తీవ్ర గాట్లు పడ్డాయి. తోటి వాళ్లు గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జీవీపీల తొలగింపులో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

కమిషనర్ రాహుల్ మీనా


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గార్బేజ్ వలర్నబుల్ పాయింట్లు(జీవీపీ) తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం పబ్లిక్‌హెల్త్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జీవీపీల తొలగింపు, ఇంటింటి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం, ఐవీఆర్ఎస్ సర్వే సహ పలు అంశాలపై చర్చించారు. జీవీపీలను నూరుశాతం తొలగించాలన్నారు. అవసరమైతే రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్ సాయంతో ఆయా ప్రదేశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే షాపుల నిర్వాహకులు, వీధి వ్యాపారులు తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లు ఉపయోగించేలా చూడాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు విధించాలన్నారు.రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నగరంలో గుర్తించిన ఫీడింగ్ పాయింట్లను శానిటరీ సూపర్‌వైజర్లు పరిశీలించి రెండు రోజుల్లో ఖరారు చేయాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడంతో పాటు రీఓపెన్ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్,ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

రాజానగరం మండల సమావేశంలో ఎంపీడీవో ఝాన్సీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఝాన్సీ

రాజానగరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొంటున్న ప్రజా సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి, సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మండల సా ధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన మంగళవారం జరిగింది. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్షించారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న ఎరువుల విడుదల, పంపిణీ వ్యవహారంలో తమకు సమాచారం ఇవ్వడం లేదని, సచివాలయాల్లో అన్ని శాఖలకు సంబంధించిన ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. పుణ్యక్షేత్రం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గత ప్రభుత్వంలో రూ.65 లక్షలతో తలపెటిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ఈ విషయమై మూడు పర్యాయాలుగా మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు మొరపెట్టుకున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదని సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. సమావేశంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గంగిశెట్టి చంటిబాబు, కార్మి క సంక్షేమశాఖ డైరెక్టర్ నీలపాల అరవరాజు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కోడి వీరరాఘవ, ఏఎంసీ చైర్‌పర్సన్ తనకాల వెంకటరమణమ్మ,మండల పరిషత్ ఏవో ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ పాల్గొన్నారు.

కీలకమైన రోడ్లు అభివృద్ధి చేయండి

రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఎమ్మెల్యే బత్తుల వినతి

కోరుకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే పుష్కరాల నాటికి రాజానగరం నియోజకవర్గంలోని కీలకమైన రోడ్లు అన్నింటిని అభివృద్ధి చేయాలని ఏపీ పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన తాడేపల్లి కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఎన్‌హెచ్-216 ద్వారా ఉత్తర భారతదేశం నుంచి వచ్చే యాత్రికులకు రాజానగరం ముఖ ద్వారంగా పనిచేస్తుందని, దాని మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలన్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అంచనాల్లో భాగంగా రూ.8177లక్షల వ్యయంతో 60 పనులు ప్రతిపాదించబడ్డాయన్నారు. వీటిలో రూ.3000 లక్షల విలువైన 30 పనులు తక్షణ ప్రాధాన్యతగా గుర్తించామన్నారు. నియోజకవర్గంలో 47 పంచాయతీ సెక్రటరీ పోస్టులు, 188 సచివాలయాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలన్నారు.అలాగే రూ12,447.61 లక్షల వ్యయంతో కోరుకొండలో 128 పనులు, రాజానగరంలో 746, సీతానగరంలో 705 సీసీ డ్రైన్ పనులు చేపట్టాలన్నారు. మూడు మండలాల్లో వివిధ గ్రామాల్లో రూ.14802.00 లక్షల వ్యయంతో 1130 సీసీ రోడ్లు, రూ.9553.46 లక్షల వ్యయంతో 358 గ్రావెల్ రోడ్లు, పుంత రోడ్లు, రూ.2720 లక్షల వ్యయంతో 84 కమ్యూనిటీ హాళ్లు, రూ.1932 లక్షల వ్యయంతో 135 శ్మశాన వా టికల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుజేసి అందజేశారు. అలాగే బొబ్బిలిలంక-మిర్తిపాడు హైలెవల్ వంతెన, ములకల్లంక గోదావరి నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలని రూ.45 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణకు 98 రిక్షాలు, వ్యర్థాల రవాణాకు 24 ట్రాక్టర్లు, 22 ఈ-ఆటోలు, 4 మినీ జేసీబీలు ఏర్పాటు చేయాలని కోరారు. రఘుదేవపురం-నలగొండ రోడ్డులోని హై-లెవల్ వంతెన నిర్మించాలన్నారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు అనుసంధానంగా 62 రోడ్లకు రూ.88కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు.ఇదిలా ఉండగా రాజానగరం మండలం దివాన్‌చెరువు పంచాయతీలో ఉన్న శ్రీరాంపురం, సీతానగరం మండలం పురుషోత్తపట్నం పంచాయతీలో ఉన్న రామచంద్రపురం,రాజానగరం పంచాయతీలో ఉన్న సూర్యరావుపేట గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు బత్తుల విజ్ఞప్తి చేశారు.

పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణానికి నిధులివ్వండి

డీజీపీతో ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ పోలీస్ స్టేషన్లకు, కోరుకొండ సర్కిల్ కార్యాలయానికి భవనాలు నిర్మించాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు ఎమ్మెల్యే బత్తుల విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీజీపీని మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కోరుకొండలో నార్త్‌జోన్ డీఎస్పీ కార్యాలయానికి, సర్కిల్ కార్యాలయానికి నిధులు మంజూరు చేయాలని డీజీపీని కోరారు. కోరుకొండ పోలీస్ స్టేషన్లకు సొంత భవనాలు లేకపోవడంతో తాత్కాలికంగా రైతు సేవా కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. మూడు మండలాల పోలీసులకు వాహనాలు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఆంధ్ర కింగ్ తాలూకా
సూర్యమినీ	: జూటోపియా-2
సూర్యప్యాలస్	: రివాల్వర్ రీటా
స్వామి	: బిజినెస్‌మేన్
అనుశ్రీ(సాయికృష్ణ)	: 12 ఎ రైల్వే కాలనీ
శివజ్యోతి	: ఆంధ్ర కింగ్ తాలూకా
రాజా	: ఇట్లు మీ ఎదవ
ఊర్వశి	: రాజు వెడ్స్ రాంబాయి
మేనక	: ది గర్ల్ ఫ్రెండ్
రంభ	: ఆంధ్ర కింగ్ తాలూకా
అప్సర	: తేరీ ఇష్క్ మే
అశోక	: ఆంధ్ర కింగ్ తాలూకా
వీఎస్ మహల్(నామవరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
వెంకటసూర్య(కడియం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
సత్యగౌరి (అనపర్తి)	: ఆంధ్ర కింగ్ తాలూకా
సూర్యశ్రీ (అనపర్తి)	: రాజు వెడ్స్ రాంబాయి
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: బిజినెస్‌మేన్
రామకృష్ణ(కోరుకొండ)	: ఆంధ్ర కింగ్ తాలూకా
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
శ్రీనివాస (గోకవరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: రాజు వెడ్స్ రాంబాయి
లలితామహల్(రంపచోడవరం)	: ఆంధ్ర కింగ్ తాలూకా
నవయుగ(చింతూరు)	: ఆంధ్ర కింగ్ తాలూకా



నేడు నల్లజర్లకు సీఎం చంద్రబాబు


ముస్తాబైన సీఎం సభావేదిక

వెయ్యి మంది రైతులతో ముఖాముఖి

రాజమహేంద్రవరం/సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాకకు నల్లజర్ల ముస్తాబైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం 10.30గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలి కాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11.10 గంటలకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి 11.30గంటలకు నల్లజర్లలో వ్యవసాయ భూమి పరిశీలనకు వెళ్తారు. 11.30 నుంచి 11.50 వరకూ స్టాల్స్‌ను సందర్శిస్తారు. కలెక్టర్ స్వాగత ప్రసంగం చేస్తారు. 12.15 నుంచి 12.20 వరకూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రసంగిస్తారు. సీఎం చంద్రబాబు 12.55 గంటల వరకూ 1000 మంది రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. వేదికపై ఏర్పాటు చేసిన మంచంపై కూర్చుని రైతులు, వారి కుటుంబాలతో కూడా మాట్లాడతారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. తర్వాత మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విశ్రాంతి తీసుకుంటారు. 1.45 నుంచి 3.15 గంటల వరకూ గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 3.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 3.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళ్తారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పెద్దసంఖ్యలో రైతులు పాల్గొంటున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజావేదిక వద్ద ఐదు స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. సభలో రైతులు, వ్యవసాయం, హార్టీకల్చర్, మత్స్య శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ జీవీకే అశోక్‌కుమార్, ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. 1200మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. పర్యటన సజావుగా సాగేలా సభావేదిక, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు, భద్రత చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జేసీ వై.మేఘ స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు.


నల్లజర్లలో సీఎం పాల్గొననున్న రైతన్న - మీకోసం సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ మేఘ స్వరూప్ తదితరులు


కాకినాడ పెద్దాసుపత్రిలో జ్వరపీడితులు

అమలాపురం మండలం బండారులంకలో ఫీవర్ సర్వే

ఆసుపత్రుల క్యూ!

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న జ్వరపీడితులు

ఫీవర్స్.. వైరల్!

సీజన్ మారింది. చలిగాలుల తాకిడి అధికమైంది. తుఫాన్ ప్రభావంతో ఒక వైపు వానలు కురుస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు అధికంగా జ్వరాల బారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గాలిలో వైరస్ కారణంగా చికెన్ ఫాక్స్, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, కీళ్ల నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో క్యూ కడుతున్నారు. కొన్ని నెలలుగా డెంగీ, మలేరియా కేసులు నమోదవుతుండగా స్క్రబ్ టైఫస్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.

- కాకినాడ/ అమలాపురం/రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జ్వర పీడితులు పెరుగుతున్నారు. చిన్న,పెద్ద, తేడా లేకుండా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. గత వారం రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో భారీగా కేసులు నమోదవుతున్నాయి. సాధారణంగా కాకినాడ జీజీహెచ్‌కు ప్రతి రోజూ 2 వేలకు పైగా ఓపీ ఉంటుంది.వీరిలో జ్వర పీడితులే అధికంగా ఉంటున్నారు. రాజ మహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతిరోజూ సుమారు వెయ్యి నుంచి 1200 వరకూ ఓపీ ఉంటే వీరిలో ఎక్కువ మంది సీజనల్ వ్యాధులతోనే ఆసుపత్రికి వస్తున్నట్టు జనరల్ మెడిసిన్ వైద్యులు చెబుతున్నారు. కోనసీమలోనూ ఇదే పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి లక్షణాలతో ఆసుపత్రులకు వస్తున్నారు. ఇంట్లో ఒకరి తర్వాత ఒకరు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి పోతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రం తగ్గడం లేదని మళ్లీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.అసలే జ్వరంతో రోగులు బాధపడుతుంటే రకరకాల టెస్టులతో ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు మరింత నీరసించేలా చేస్తున్నారు.రక్త, బీపీ, షుగర్ టెస్టులతో పిండేస్తున్నారు. పలువురు ఆసుపత్రులకు వెళ్లేందుకే భయపడుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- వైరల్, డెంగీ జ్వరాలతో ఇక్కట్లు
- కాకినాడలో స్క్రబ్ టైఫస్ కేసులు
- తూర్పు, కోనసీమల్లో డెంగీ

కాకినాడలో స్క్రబ్ టైఫస్..

ఈ ఏడాది జనవరి నుంచి పరిశీలిస్తే కాకినాడలో ఐదు వేల మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 200కిపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. నాలుగు నెలలుగా కేసులు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు కలవరపెడుతున్నాయి. నల్లి లాంటి ఓ కీటకం కుట్టడం ద్వారా కుట్టినచోట దద్దుర్లు, నల్లటి మచ్చలు ఏర్పడడం, జ్వరం, వాంతులు, తల, ఒంటి నొప్పులు, పొడి దగ్గు లక్షణాలతో ఆస్పత్రికి వచ్చేవారు అధికమయ్యారు. లాలాజలంతో ఈ ఇన్ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి సోకుతున్నట్టు వైద్యులు ప్రాథమికంగా గుర్తించారు. కాకినాడ జిల్లాలోనే అత్యధికంగా 1452 మందికి పరీక్షలు చేయగా 148 కేసులు నమోదయ్యాయి. కాకినాడ, అర్బన్, గ్రామీణ ప్రాంతాలతో పాటు సామర్లకోట, పెద్దాపురం తుని, ప్రత్తిపాడు ప్రాంతాల నుంచి ఎక్కువ కేసులు వచ్చాయి. మిగతా మండలాల్లోను ఈ వ్యాధి బాధితులు ఉన్నారు. గత నెల నవంబర్‌లో 251 మందిని పరీక్షించగా 47మంది ఈ వ్యాధికి గురయ్యారు.

స్క్రబ్ టైఫస్ సోకితే ఐదు రోజులు వైద్యం

స్క్రబ్ టైఫస్ సోకడానికి పరిసరాల అపరిశుభ్రతే కారణం. ఇంటి పరిసరాలు, పనిచేసే ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి. తుప్పల వద్ద జాగ్రత్తగా ఉండాలి. వ్యాధి సోకితే నివారణకు ఐదు రోజుల పాటు వైద్యం తీసుకోవాలి.

- డాక్టర్ ప్రభాకర్, కాకినాడ మలేరియా అధికారి

కోనసీమలో డెంగీ

కోనసీమ జిల్లాలోనూ జ్వరపీడితులు ఉన్నారు. గతేడాది జిల్లాలో 292 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 34 కేసులు నమోదయ్యాయి. వైరల్ జ్వరాల బారిన పడినవారు గతంలో రోజువారీ నివేదికల్లో 250 మంది ఉండేవారు. ప్రస్తుతం రోజుకు 170 నుంచి 180 మంది ఉంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు వెల్లడించారు. నవంబరులో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ విభాగంలో 61మందిని జ్వర పీడితులుగా గుర్తించారు. మరో 15 మంది ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకున్నారు. ప్రస్తుతం రోజుకు ఇద్దరు, ముగ్గురు మాత్రమే వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఒక డెంగీ కేసుకు ఆస్పత్రిలో వైద్యం చేయగా ఇద్దరు ఓపీ విభాగంలో డెంగీ పాజిటివ్‌గా గుర్తించామని అమలాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు వెల్లడించారు. జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులేమీ నమోదుకాలేదని డీఎంహెచ్‌వో దుర్గారావురావు వెల్లడించారు.

'తూర్పు'న ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలో మలేరియా, న్యుమోనియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఇన్‌పేషెంట్ కేసులు తక్కువగానే ఉన్నా అవుట్‌పేషెంట్లు ఎక్కువ మంది ఉంటున్నారు. పిడియాట్రిక్ విభాగంలో శ్వాసకోశ సంబంధిత సమస్యలతో చిన్నారులు వైద్యానికి వస్తున్నారు. జ్వరకేసులు నమోదవుతున్నాయి. పక్కనున్న ఏఎస్ఆర్ జిల్లా నుంచి మలేరియా కేసులు వస్తున్నాయని.. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం జీరో అని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో గోకవరం, నామవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జ్వరపీడితుల్లో కొందరికి ఇక్కడి వైద్యులు ప్రాథమికంగా మలేరియాగా నిర్ధారించినట్టు తెలిసింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో డెంగీ కేసులు మాత్రం 32 నమోదైనట్టు లెక్కలు చెబుతున్నారు.

ప్రత్యేక వైద్యం అందిస్తున్నాం

స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో జ్వర బాధితులకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నాం. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో నిత్యం వైద్యపరీక్షలు జరుగుతున్నాయి. అజిత్రోమైసిన్, డాక్సిసైక్లిన్ మందులను అందుబాటులో ఉంచాం. ఎక్కడైనా జ్వరపీడితులు పెరిగితే సమాచారం ఇవ్వాలి.

- నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా


గోదావరిలో బోట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు, అధికారులు

పర్యాటకంగా గోదావరి తీరం అభివృద్ధి

అధికారులతో కలిసి గోదావరిలో బోట్‌లో పర్యటించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు కొవ్వూరును టూరిజం హబ్‌గా తీర్చిద్దినున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గోదావరి నదిలో కొవ్వూరు గోష్పాదక్షేత్రం నుంచి కుమారదేవం వరకు పర్యాటక, రెవెన్యూ, ఏజీఆర్‌బీ శాఖల అధికారులతో కలిసి మంగళవారం బోట్‌లో పర్యటించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస చేసేందుకు కాటేజీలు, పార్కులు, రూమ్‌లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయడానికి గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. కొవ్వూరు పట్టణ ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన స్థలం ఉందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు, పర్యాటకులు గోదావరి అందాలను తిలకించేందుకు తీర ప్రాంతాన్ని పర్యాటకంగా సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. పుష్కరాలకు గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కొవ్వూరు పట్టణ, మండలంలోని సుమారు 38 స్నానఘట్టాలు సిద్ధం చేస్తున్నామన్నారు. దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని,టూరిజం జిల్లా అధికారి పి.వెంకటాచలం,ఇన్‌చార్జి డీవీఎం పవన్‌కుమార్, ఈఈ విజయభాస్కర్, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు,బోటింగ్ మేనేజర్ ఆర్.గంగబాబు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ టెన్త్ స్టడీ మెటీరియల్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ రాష్ట్ర సంఘం నిష్ణాతులతో తయారు చేయించి ముద్రించిన టెన్త్ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని డీఈవో కె.వాసుదేవరావు, ఏడీ వెంకట్రాజు ఆవిష్కరించారు.రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ నేతృత్వంలో ఈ పుస్తకాలను విడుదల చేశారు. జిల్లా కోశాధికారి ప్రసాద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచి కోటసత్తెమ్మ తిరునాళ్లు

నిడదవోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తిరునాళ్లు 4వ తేదీ గురువారం నుంచి 8వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహిస్తామని ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవి శంకర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. గురువారం ఉదయం దేవులపల్లి రవిశంకర్ దంపతులచే వైదిక స్మార్త ఆగమ ఆచారం ప్రకారం కలశ స్థాపనతో తిరునాళ్లు ప్రారంభమవుతాయి. 5వ తేదీ శుక్రవారం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, మాంగల్యదేవి అమ్మవారి దేవస్థానం వారిచే కోటసత్తెమకు చీర, సారె సమర్పణ, 6వ తేదీ నిడదవోలు ఆర్య వైశ్య సంఘంచే చీర సారె సమర్పణ, 7వ తేదీ ఆదివారం అఖిలభారత తెలుగు సేవా ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షురాలు అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వ ర్యంలో రాజమండ్రి నుంచి 101 మంది మహిళలచే చీర, సారె, కలశాలతో బోనం సమర్పణ, 8వ తేదీ సోమవారం వివిధ మేళాలతో గరగ ఉత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారి తిరునాళ్లు ఐదు రోజులు ఉదయం చండీపారాయణం, సాయంత్రం చండీ హోమం, అమ్మవారికి విశేష పూజలు చేస్తారు.



ఇళ్లివ్వండి బాబు!

టిడ్కో ఇళ్లకు పేదల ఎదురుచూపులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టిడ్కో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు..గత పదేళ్లగా పేదింట కల గంటూనే ఉన్నారు. అయినా నేటికీ కల తీర లేదు..ఇల్లు రాలేదు.గత టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను నిర్మించినా.. వైసీపీ నిర్లక్ష్యం కారణంగా పేదలకు ఇళ్లు అందలేదు. పేదల కనీస అవసరమైన ఇంటి కలను నెరవేర్చడానికి 2014లో అధికా రంలోకి వచ్చిన టీడీపీ పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను నిర్మించిన సంగతి తెలిసిందే.2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రజల గూడుకు చీడ పట్టింది. ఈనాటికి లబ్ధిదారులకు దక్కకుండా వృథాగా పడి ఉన్నాయి.మొదట్లో టీడీపీ ఎంపిక చేసిన లబ్ధి దారుల్లో కొంత మందిని వైసీపీ మార్చేసిం ది.రుణాలు సరిగ్గా ఇప్పించలేదు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికా రంలో ఉండడం తో ఇటీవల కదలిక వచ్చింది. టిడ్కో ఇళ్లను డిసెంబర్ చివరికి లబ్ధిదారులకు అప్పగిం చేలా ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది.అయితే ఈ సారైనా ఇస్తారా లేదా అనే మీమాంసలో లబ్ధిదారులు ఉన్నారు. సీఎం చంద్రబాబు తమ గోడు విని గూడు కల్పిం చాలని డిమాండ్ చేస్తున్నారు. నేడు సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టిడ్కో గృహాలుఎప్పుడిచ్చేది లేల్చాలని కోరుతున్నారు.

- నేటికి అందని వేలాది ఇళ్లు
- గత వైసీపీ నిర్లక్ష్యం.. నిలిచిన టిడ్కో
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- సొంతింటి కోసం తీవ్ర ప్రయత్నాలు
- సీఎం గారు ఇవ్వాలని డిమాండ్

డిసెంబరుకు టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

బొమ్మూరులో పెండింగ్ పనులు జరుగుతున్నాయి. తొర్రేడులో డ్రెయిన్ నిర్మిస్తు న్నాం. ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే పనులు వేగవంతం అయ్యాయి. నామవరంలో జంగిల్ క్లియరెన్స్ తీసుకున్నాం. చెట్లు కొట్టిన వెంటనే డ్రైన్, రోడ్ల నిర్మాణం, ఇతర పనులు పూర్తి చేస్తాం. నామవరం, బొమ్మూరు ఫేజ్-2 ఇళ్లను డిసెంబర్ చివరికి లబ్ధిదారులకు అప్పగిస్తాం. కొవ్వూరు, నిడద వోలు టిడ్కో ఇళ్ల విషయంలో కాంట్రాక్టర్‌ను మార్చి కొత్త కాంట్రాక్టర్‌తో ఒప్పందమైన తర్వాతే పనులు ఆరంభిస్తాం.

- పి.గంగరాజు, టిడ్కో ఈఈ

సా..గుతున్న పనులు..

రాజమహేంద్రవరంలో ఏడు ప్రాజెక్టుల కింద 6304 టిడ్కో ఇళ్లు నిర్మించారు. అందులో 5,574 మందికి రిజి స్ట్రేషన్లు పూర్తయ్యాయి.ఇంకా 690 మందికి పెండింగ్‌లో ఉన్నాయి.కానీ మౌలిక సదుపాయాల్లేకపోవడంతో ఇళ్లలో ఉన్నది మాత్రం చాలా తక్కువ మంది. చాలా ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. బొమ్మూరులో మొదటి దశలో 2528 ఇళ్లు నిర్మించారు. తొర్రేడులో 896, మోరంపూడి డిబ్లాక్ వద్ద 224, ధవళే శ్వరంలోని వడ్డెర కాలనీలో 256 నిర్మించారు.బొమ్మూరు నిర్మించిన ఇళ్లలో 2528 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించగా 1977 మంది మాత్రమే తాళాలు తీసుకున్నారు.బొమ్మూరు రెండో దశలో నిర్మించిన 2 వేల ఇళ్లను ఇంకా అప్పగించలేదు. అక్కడ ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాల్సి ఉంది. తొర్రేడులో నిర్మించిన 896 ఇళ్లలో 500 ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చారు. ధవళేశ్వరం(వడ్డెర కాలనీ)లో నిర్మించిన 256 ఇళ్లలో 234 అప్పగిం చారు. మోరంపూడి డి.బ్లాక్‌లో 224 ఇళ్లు అప్పగించినా కనీస సౌకర్యాలు లేక కేవలం 15 మంది మాత్రమే ఉం టున్నారు. రెండో దశలో నామవరంలో 1104 ఇళ్లు, సిం హాచలనగర్‌లో 96 ఇళ్లు, బొమ్మూరు ఫేజ్-2లో 1100 నిర్మించారు.ఇవి ఇంకా పూర్తి కాలేదు. మౌలిక సదు పా యాలు కల్పించలేదు. బొమ్మూరు ఫేజ్-2, నామవరం టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు.బొమ్మూరులో ఇళ్లను డిసెంబర్ చివరినాటికి లబ్ధిదా రులకు అప్పగిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు.నామవరంలో చెట్లు తొలగించిన తర్వాత పనులు ఆరంభమ వుతాయి.డిసెంబర్ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేస్తామని అధికారులు చెబుతున్నారు.

నిడదవోలు, కొవ్వూరులో ఇలా..

నిడదవోలులో 1755 మంజూరు కాగా 1248 ఎంపిక చేసి 1152 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లబ్ధిదా రుల ఎంపిక కూడా పూర్తిగా జరగలేదు.ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. కొవ్వూరు పరిధిలో పేదలకు 480 ఇళ్లు మంజూరు కాగా 480 మొదలు పెట్టారు. ఇళ్ల నిర్మాణం జరిగినా మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో మొత్తం పెండింగ్‌లో పడింది. ఇక్కడ పనులు ఆపేసిన కాంట్రాక్టరును రద్దు చేసి కొత్త కాంట్రాక్టరు పనులు అప్పగించాలనే ఆలోచనతో ఉన్నారు. కొవ్వూరు, నిడదవోలు టిడ్కో ఇళ్లు 2026లోనే ఇవి లబ్ధిదారులకు అందే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఏపీజీఈఏ జిల్లా ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనివార్య కారణాల వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా ఉపాధ్యక్ష పదవికి, సంఘం సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు పి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. గత కొన్నేళ్లగా అసోసియేషన్లలో అధిష్ఠానం, సభ్యుల కోరిక మేరకు కొనసాగడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు ఆయా సంఘాల అధ్యక్షులకు వాట్సాప్ ద్వారా రాజీనామా లేఖలను పంపించడం జరిగిందని రవికుమార్ పేర్కొన్నారు.



నల్లజర్లలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

సీఎం రాక కోసం
నల్లజర్ల ముస్తాబు

● రైతులతో చంద్రబాబు ముఖాముఖీ ● నల్లజర్ల-చీపురుగూడెం రోడ్డులో బహిరంగ సభ
● మధ్యాహ్నం టీడీపీ కార్యకర్తల సమావేశం ● సభా ప్రాంగణంలోనే భోజన ఏర్పాటు
● రైతుల కోసం స్టాల్స్ ఏర్పాటు ● బాంబ్‌స్క్వాడ్‌తో సభా ప్రాంగణం జల్లెడ

నల్లజర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతన్న మీకోసం కార్యక్రమానికి నల్లజర్ల విచ్చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాకకోసం నల్లజర్ల-చీపురుగూడెం రహదారి రైతులు, కార్యకర్తలు, అధికారులతో కళకళలాడుతోంది. బుధవా రం పదిగంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేశా రు. రైతులతో ముఖాముఖీ కార్యక్రమం ఏర్పా టుచేసి రైతులు ఆధునిక వ్యవసాయం చేసే విధంగా వివిధ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇం దుకు సంబంధించి మంగళవారం మండల పరి షత్ కార్యాలయంలో రైతులతో కలెక్టర్ కీర్తి చేకూరి రైతులకు అవగాహన కల్పించారు. బు ధవారం మధ్యాహ్నం నుంచి చంద్రబాబు టీడీ పీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేసి పార్టీ విధానాలపై చర్చించనున్నారు. సభ అనంతరం 5వేల మందికి భోజన ఏర్పాటు చేస్తున్నారు.

పటిష్టమైన భద్రత ఏర్పాట్లు

సభా ప్రాంగణాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రదేశం వరకు పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో జల్లెడ పట్టారు. రాత్రి నుంచి ఆటువైపు ఎవరూ రాకుండా పటి ష్ట భద్రతా ఏర్పాటుచేశారు. ఏలూరు ఐజీ అశోక్ కుమార్, తూర్పు గోదావరిజిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ భద్రతా ఏర్పాట్లు చూస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబు కాన్వాయ్ ట్రైల్‌రన్ వేసింది. హెలి



హెలిప్యాడ్ వద్ద పరిశీలిస్తున్న డాగ్‌స్క్వాడ్

ప్యాడ్‌వద్ద హెలికాప్టర్ ట్రైల్ రన్ నిర్వహించారు.

సభ విజయవంతం చేయాలి

దేవరపల్లి (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్ర బాబునాయుడు బుధవారం ఉదయం 11గం టలకు రైతన్న మీకోసం ముగింపు సభను విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్య క్షుడు ఆంద్రూ అనీల్, టీడీపీనేతలు అన్నారు. దేవరపల్లిలో సొసైటీ ఛైర్‌పర్సన్ పెనుమత్స సుబ్బరాజు ఇంటివద్ద ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆంద్రూ అనిల్ మాట్లాడుతూ నల్లజర్లలో జరిగే రైతన్న మీకోసం ముగింపు సభను విజయవంతం చేయడానికి మండలం లోని రైతులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకు లు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపు నిచ్చా రు. కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉదయం 10గంటల కల్లా దేవరపల్లి నుంచి బ యల్దేరి నల్లజర్ల చేరుకోవాలన్నారు. అక్కడ రైతు లతో సమీక్షా సమావేశం ఉంటుందని రైతుల కు సంబంధించిన ఆధునిక వ్యవసాయం గురించి స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, ముళ్లపూడి దొరాజీచౌదరి, పెను మత్స సుబ్బరాజు, ఉప్పులూరి రామారావు, పిన్న మనేని సత్యనారాయణ, గన్నమని గోపాలకృష్ణ, కంటిపూడి సుబ్బారావు, ఆచంట శివశేషారావు, నున్నా నాగేశ్వరరావు, దంపనబోయిన బ్రహ్మారా జు, గడా రామనరసింహారావు, కాట్రగడ్డ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి తరలిరండి

గోపాలపురం,(ఆంధ్రజ్యోతి): నియోజకవ ర్గంలోని నల్లజర్ల మండలంలో జరిగే రైతన్న మీకోసం కార్యక్రమానికి కూటమి నాయకులు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో కూటమి నాయ కులతో సీఎం సభా ఏర్పాట్లపై మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గ్రామాల్లో కూటమి నాయకులు సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో యూ నిట్, బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు అనుబంధ సంఘా ల ప్రతినిధులు, కార్యకర్తలను ఉదయం 8గం టలకు ఏఎంసీకి తీసుకురావాలన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా నల్లజర్ల సభా ప్రాంగణానికి చేరుకుంటారని అన్నారు. గ్రామాల్లో రైతులను సమావేశానికి హాజరయ్యేలా చూడాల్సిన బాధ్య త ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. బుధవారం నల్లజర్లలో స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంక ట్రాజు ఆధ్వర్యంలో జరుగనున్న రైతన్న మీకోస ం కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖులు హాజరవుతార ని అన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమి టీసభ్యులు హోతా రాజాబాబు, నియోజకవర్గ బీసీ ఎల్ అధ్యక్షుడు నాగరాజు, రాజమండ్రి పార్లమెంట్ రైతు కార్యదర్శి జ్యేష్ఠ శ్రీనివాసరావు, గోపాలపురం చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షులు వడ్లమూడి రమేశ్, గద్దే హరిబాబు, మండల తెలుగుయువత అధ్యక్షులు పసుమర్తి రాఘవ చౌదరి, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసా ద్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పడమట శ్రీనివాస్, నియోజకవర్గ మైనార్టీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు సైద్‌మాబు, పెద దుర్గారావు, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీధర్, నందమూరి సత్య నారాయణ, రాంబాబు, ఎస్‌కే. కాశీం, ఆయా గ్రామకమిటీల అధ్యక్ష, కార్యదర్శు లు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, అను బంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.





దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, గోపాలపురం సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు

దిత్వా తుఫాన్‌తో దిక్కుతోచని రైతన్న

● వర్షంతో రైతులు ఇబ్బందులు

పెరవలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో వరి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మెట్టపంట లకు ఈ వర్షం మేలు చేసినప్పటికీ ఇం కా కోయని వరి చేలకు కోసి ధాన్యం రాశులుగా ఉన్నవారికి ఎంతో నష్టమని రైతులు వాపోతున్నారు. కానూరు, ఉ సులుమర్రు గ్రామాల పరిధిలో వరికో తలు పూర్తికాగా,పెరవలి, ముక్కామల, ఖండవల్లి గ్రామాల పరిధిలో కోతలు కోయాల్సిన వరిచేలు ఉన్నాయి. ఇప్ప టికే చాలా వరకు కోసి రాశులుగా ఉం చి ఆరబెట్టి మిల్లులకు తోలేందుకు సిద్ధం చేశారు. అయితే ఆకాశం మ బ్బులుకమ్మి ఉండటంతో గత రెండు రోజులుగా బరకాలు కప్పి ఉంచారు. మంగళవారం ఒక్కసారిగా వర్షం ప్రా రంభమై ఎడతెడపి లేకుండా కురుస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొన్నిచో ట్ల వర్షంలోనే ధాన్యం బస్తాలను ట్రాక్టర్లపై ఎగుమతి చేస్తున్నారు.



తీపర్రు వద్ద వర్షంలో లారీలో ధాన్యం ఎగుమతి చేస్తున్న దృశ్యం



సమిశ్రగూడెం-రాజమహేంద్రవరం వెళ్లే రహదారిపై కురుస్తున్న వర్షం

నిడదవోలు(ఆంధ్రజ్యోతి): ప్రతి నిత్యం వంద లాది వాహనాల రాకపోకలతో బిజీబిజీగా ఉండే సమస్రగూడెం, రాజమండ్రి ప్రధాన రహ దారి తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కారణంగా నిర్మానుష్యంగా మారింది.

కాలుష్య నివారణపై విద్యార్థులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రాసుగర్స్ మేనేజర్ కృష్ణారావు

కొవ్వూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పరిశ్ర మలలో కాలుష్యం, వాతావరణ కాలుష్య నివార ణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం లోని సంస్కృత కళాశాలలో ఆంధ్రాసుగర్స్ ఫ్యా క్టరీ మేనేజర్ ఈ.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫ్యాక్టరీ చీఫ్ మెకానికల్ ఇంజ నీర్ కె.వి.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఘన, ద్రవ, వాయు కాలుష్యాలతోపాటు ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్, మెడికల్, శబ్ద కాలుష్యాల నివారణ చర్యలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.గౌరీశంకర్ మాట్లాడుతూ కా లుష్య నివారణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.వాణీకుమారి, లోకేష్, కె.మార్కండేయశర్మ, ఆంధ్రాసుగర్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సీహెచ్.శుకమహర్షి, భద్రతాధికారి ఎస్.ఎస్.సు బ్రహ్మణ్యం విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆంధ్రాసుగర్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగులకు జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని పుర స్కరించుకుని కాలుష్య నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి రూ.1.61 లక్షలు విరాళం



వాడపల్లి వెంకన్నకు విరాళం అందిస్తున్న దాత

ఆత్రేయపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడ పల్లి శ్రీవెంకటేశ్వరస్వామి పు ణ్యక్షేత్రం మంగళవారం వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వ హించుకున్నారు. స్వామి వారి ఆలయ అభివృద్ధికి నిడద వో లు మండలం పురుషో త్తప ల్లికి చెందిన చిర్రాపురపు కాశీ విశ్వనాద్, శ్రావణకుమార్ కుటుంబ సభ్యులు రూ.1,61,123లు విరాళం సమర్పించారు. దాతల కు స్వామివారి చిత్రపటం అంద జేశారు. ఆశేష భక్తజనం స్వామివారి అన్నప్ర సాదం స్వీకరించారు.

నేడు క్షేత్రంలో హనుమద్వ్రతం



ద్వారకాతిరుమలలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): చినవెంకన్న ప్రధాన ఆలయానికి ఉపా లయమైన ఆంజనేయస్వామివారి ఆలయంలో బుధవారం జరుగనున్న హనుమద్వ్రతానికి మంగళవారం ఏర్పాట్లు చేశారు. ఆలయ పరి సరాలను సుందరీకరించారు. ఆలయం ముం దు పందిళ్లు ఏర్పాటుచేసి ఆలయానికి రంగు లు వేసి ముస్తాబు చేశారు. ఆలయ పరిస రాలను పుష్పమాలికలు, మామిడితోరణాలతో అలంకరించారు. హోమం చేయడానికి యజ్ఞ కుండం ఏర్పాటుచేశారు. బుధవారం ఉదయం పంచామృతస్నపన, సహస్రనాగావళి పూజలు, సింధూర పూజలు నిర్వహిస్తారని భక్తులు తరలిరావాలని ఆలయ ఈవో ఎన్వీ సత్యనా రాయణమూర్తి కోరారు.

పెద్దేవం సర్పంచ్‌కి ప్రొటోకాల్ అవమానం

తాళ్లపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంగ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ము ప్పిడి వెంకటేశ్వరరావు చేపట్టిన శం కుస్థాపన కార్యక్రమాలలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు కు ప్రోటోకాల్ పాటించకుండా చేయడం పట్ల ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాల యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీర్మాణాలు లేకుండా పనులు చేస్తున్నట్లు వైసీపీ నాయకులు మభ్యపెడుతు న్నారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడాన్ని కూడా తోట రామకృష్ణ వ్యతిరేకించారు. గ్రామంలో ఒకసారి శంకుస్థాపన చేసిన పనులకు మరో సారి భూమి పూజచేసిన ఘనత కూడా టీడీపీ దేనని అన్నారు. గ్రామంలోని 8వ వార్డు లో ఎంపీ పురందేశ్వరి వచ్చిన సందర్భంలో తీర్మా ణాలు లేకుండా శిలాఫలకంవేసి నేటికీ పనులు ప్రారంభించని సంఘటనే ఉదాహరణ.బట్టు సుబ్బారావు, కోడి గంగారావు, సత్యన్నారాయణ, రామకృష్ణ, వీర్రాజు, కృష్ణార్జునుడు పాల్గొన్నారు.

చాగల్లులో భారీ అన్నసమారాధన



చాగల్లు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లు సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. వారం రోజులపాటు ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వ హించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ళ హరిబాబు, ఉత్సవకమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అన్నక్యాంటీన్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి



అన్నక్యాంటీన్ పరిశీలిస్తున్న జిల్లా ప్రజారోగ్య అసిస్టెంట్ ఇంజనీర్ గ్రంధి సందీప్

గోపాలపురం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): అన్నక్యాంటీన్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని పబ్లిక్‌హెల్త్ అసిస్టెంట్ ఇంజనీర్ గ్రంధి సందీప్ అన్నారు. గోపాలపురంలో నిర్మాణంలోఉన్న అన్నక్యాంటీన్ నూతన భవననిర్మాణ పనులు ఆయన మం గళ వారం పరిశీలించారు. ఆయన మా ట్లాడుతూ భవనానికి చుట్టూ ప్రహరీ గోడ, ముఖద్వార గేటు నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. జిల్లాలో అనపర్తి, రాజానగరం, రంప చోడవరంలో అన్నక్యాంటీన్ భవ నాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా గోపాలపురం, కోలమూరులో 60శా తంపైగా భవన నిర్మాణపనులు జరిగాయన్నా రు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి భవన నిర్మాణాలు జరగాలన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయా లన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ కర్రి అజయ్, టీడీపీ నాయకులు జ్యేష్ఠ శ్రీధర్ ఉన్నారు.

కారు ఢీకొని మోటారుసైక్లిస్టు మృతి



మృతుడు కొంపెల్ల శివనాగేంద్రవరప్రసాద్

దేవరపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోటర్ సైకిల్‌ను కారువెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తాడే పల్లిగూడెంలోని వీకర్స్ కాలనీకి చెందిన కొంపెల్ల శివనాగేంద్రవరప్రసాద్ (35) నూనె వ్యాపారం చేస్తుంటాడు. మృతుడు అక్కకు ఆరోగ్యం బాగోలేదని దేవరపల్లి ఆసుపత్రిలో చూడడానికి వస్తున్నాడు. యర్నగూడెం శివారు జాతీయరహదారి వద్ద ఏలూరు వైపు నుంచి దేవరపల్లి వైపు వస్తున్న కారు వేగంగా మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో కొన ఊపిరితో ఉన్న కొం పెల్ల శివనాగేంద్రవర ప్రసాద్‌ను అంబు లెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య నాగజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



అదుపుతప్పి డివైడర్ ఎక్కిన కారు

● తప్పిన పెనుప్రమాదం

ద్వారకాతిరుమల, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): అతివేగంగా శ్రీవారి క్షేత్రానికి వెళు తున్న సఫారీ కారు అదుపుతప్పి మండల ంలోని తిమ్మాపురం శివారులో డివైడర్ పైకి దూసుకుపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహ దారిపై ఘటనా సమ యంలో ఏ వాహనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వారికి ఏవిధమైన గాయాలు కాకపోవడంతో అం దరూ ఊపిరిపీల్చుకున్నారు. ఏలూరువైపు నుంచి ద్వా రకాతిరుమలకు అతివేగంగా వస్తున్న ఈ కారు ఘటనాస్థలంవద్ద అదు పుతప్పి డివైడర్‌వైపు వేగంగా దూసుకెళ్లి ంది. ఆ వేగానికి అది పైకి ఎక్కేసింది. భయాందోళనలకు గురైన స్థానికులు, వాహనదారులు ఘటనాస్థలం వద్దకుచేరు కున్నారు.కారులో ప్రయాణికులు సురక్షితం గా ఉండటంతో ఊపి రిపీల్చుకున్నారు.

పసలపూడి వాసికి అవార్డు

ఉంద్రాజవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యో తి): మండలంలోని పసలపూడి గ్రామానికి చెందిన యువర్స్ సర్వెంట్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు చీపుళ్ల విజయ్‌కు స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా ఖర్మవీర్ చక్ర అవార్డు వచ్చినట్లు మంగళవారం ఒక ప్రక టనలో విలేకరులకు తెలిపారు. గత కొన్నే ళ్లుగా తాను చేస్తున్న సేవాకార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం ఆనం దంగా ఉందని, మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు చేస్తానని చెప్పారు.

నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ప్రశంసలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్త్రీ శక్తి మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకం అమలు తర్వాత సెప్టెంబరు నెలకు సంబంధించి జీరో బ్రేక్‌డౌన్స్‌తో షెడ్యూళ్లు తిప్పినందుకు నిడదవోలు డిపో మేనేజర్ ధనుంజయ ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ ద్వారకాతిరుమలరావు నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈమేరకు ఎండీ ద్వారకా తిరుమలరా వు ఇచ్చిన ప్రశంసాపత్రాన్ని మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అ ధికారి వైఎస్ఎన్ మూర్తి చేతులమీదుగా ధనుంజయ అందుకున్నారు.



జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న నిడదవోలు డీఎం ధనుంజయ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు కాలుష్య నివారణపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్

కొవ్వూరు, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో పరిశ్రమలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాహనాల కారణంగా పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రతి విద్యార్థి తనవంతు పాత్ర పోషించాలని కొవ్వూ రు ఏబీఎన్, వీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ అన్నారు. అల్లూరి బాపినీ డు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఏకో క్లబ్, లైఫ్ సైన్సెస్ డిపార్టుమెంటు సంయుక్తంగా జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించాయి. ప్రిన్సిపాల్ రామ్మోహన్ మాట్లాడుతూ కాలుష్య ప్ర భావాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్ మాట్లాడుతూ 1984 డిసెంబర్ 2న బోపాల్‌లో జరిగిన ప్రమాద సంఘటనను పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఈరోజున జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని అమలు చే స్తుందన్నారు. విద్యార్థులు కాలుష్య నియంత్రణపై పోస్టర్లు ప్రదర్శిస్తూ, ప్రసం గించారు. ఈ కార్యక్రమంలో నాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ ప్రవీణ్, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ బి.రత్నదీపిక, ప్లేస్‌మెంటు ఆఫీసర్ కె.సూరిబాబు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ ప్రతిభా పోటీలకు నిడదవోలు విద్యార్థుల ఎంపిక



నిడదవోలు కౌశల్ ప్రతిభా పరీక్షల్లో విజేతలుగా నిలిచిన జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

నిడదవోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):నిడదవోలు పట్టణంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహించే కౌశల్ ప్రతిభా పరీక్షల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీ లకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.అరుణ తెలి పారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబరు 27న తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి కౌశల్ ప్రతిభ క్విజ్ విభాగంలో అమరపూరి జషిక, కౌశల్ ప్రతిభా పరీక్ష పోస్టర్ విభాగంలో అమరపూరి అంశికలు ఎంపిక య్యారని తెలిపారు. ఈ విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు

'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'



సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు

నిడదవోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలో పేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విజ్జేశ్వరరెడ్డి అన్నారు. మంగళ వారం నిడదవోలు మండలం విజ్జేశ్వర గ్రామంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ కార్యదర్శి అంబాప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రె స్‌పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయికి వెళ్లాలన్నారు. బూత్‌స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పూర్వ వైభవం తీసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, సుజాత, కాకి కిషోర్, భాస్కరప్రసాద్, కటిక శ్రీను, రమణ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవో సూర్యప్రకాశరావుకు మానవతా ప్రజ్ఞ బిరుదు ప్రదానం



హెచ్ఎం యుగంధర్‌కుమార్‌కు విద్యాతపస్వి బిరుదుతో సత్కరిస్తున్న మానాశ్రీ

కొవ్వూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండల పరిషత్ కా ర్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న బోగరాజు సూర్యప్రకాశ రావుకు మానవతాప్రజ్ఞ బిరుదుతో సత్కరించారు. కొవ్వూరు పట్టణానికి చెందిన సినీగేయ రచయిత మద్దూరి నాగాదిత్య శ్రీనివాస్(మానాశ్రీ) పుట్టి నరోజును పురస్కరించుకుని ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆనందోత్సవంలో మానాశ్రీ పాటల పల్లకి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూ టీ ఎంపీడీ వోగా పనిచేస్తున్న బోగరాజు సూర్యప్రకాశరావుకు మానవతా ప్రజ్ఞ, వాడపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.యుగం ధర్‌కుమార్‌కు విద్యాతపస్వి బిరుదులను ప్రదానం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సూర్యప్రకాశరావుకు ఎంపీడీవో టీబీవీ రమణ ఆధ్వర్యంలో మానాశ్రీ బిరుదు ప్రదానం చేసి శాలువాతో సత్కరిం చారు. ఈ కార్యక్రమాల్లో మండలపరిషత్ కార్యాలయ సూపరింటెండెంటు వీవీఎస్ చౌదరి, సిబ్బంది, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు ఎంపికైన ఉపాధ్యాయులు



మండల క్రికెట్ టీమ్‌కి ఎంపికైన ఉపాధ్యాయులు

దేవరపల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్టేట్‌లెవెల్ ఎస్‌జీ ఎఫ్‌లో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు పురుషుల విభాగంలో క్రికెట్, మహిళా టీచర్లకు త్రోబాల్, ఎంపిక చేసినట్లు ఎంఈవో అప్పారావు తెలిపా రు. దేవరపల్లి అంబటి సత్యనారాయణ రావు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన పోటీల్లో క్రికెట్ జట్టు, త్రోబాల్ జట్టు ఈనెల 12, 13తేదీల్లో జరిగే డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఎంఈవో అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు, ఆటల పోటీల్లో పాల్గొనటం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక ధృడత్వం కలిగి ఉంటారని ఎంపికైన జట్లను అభినంది ంచారు. క్రికెట్ జట్టుకు ఎంపికైన ఉపాధ్యాయులు జీ.చంద్రరావు, ఎం.వెంకట్రాజు, పీటీ మహేశ్, ఎం.అబ్బులు, ఎస్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, రామారా వు, ఏ.శ్రీనివాస్, సుధాకర్, ప్రసాదరావు, ఉదయ్, కే.రామ్‌కుమార్, శ్రీనివాసరావు, కె.మాణిక్యం, నాగరాజు, ఎల్.బుజ్జిబాబు, ఏ.సతీశ్‌కుమార్, త్రో బాల్ జట్టుకు ఎంపికైన మహిళా ఉపాధ్యాయులు కె.వనిత, టీ.రమా జానకి, వెంకటలక్ష్మి, ఎం.మాధవి, సంధ్యా, ఎన్.కోమలిలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో దేవరపల్లి ప్రధానోపాధ్యాయులు ఐ.సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయు పాల్గొన్నారు.

రేషన్ షాపుల సాధారణ తనిఖీ

తాళ్లపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జేసీ ఆదేశాలతో రేషన్ షాపు లను సాధారణ తనిఖీ చేస్తున్నట్లు మంగవారం తహసీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. తాళ్లపూడిలోని 12వ నెంబరు రేషన్ షాపులోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్ధార్ మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీనెలా కొన్ని షాపులను తనిఖీచేసి రేషన్ సరిగా అందుతుందా అని పరిశీలన చేస్తున్నామని, సీఎస్‌డీటీ కొన్ని రేషన్ షాపులను తనిఖీ చేస్తారని అన్నారు. రేషన్‌షాపు వద్ద ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు.